

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి ఆదివారం 07-08-2022 సంపుటి : 03 సంచిక : 307 పేజీలు : 4 వెల : రూ 3-00

# ఉపరాష్ట్రపతి ఎన్నికలు

పార్లమెంట్‌లో ఓటు వేసిన ప్రముఖులు




న్యూఢిల్లీ : ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పలువురు ప్రముఖులు ఓటు వేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీ, ఆప్ నేత హర్భజన్ సింగ్, బీజేపీ ఎంపీ హేమ మాలిని పార్లమెంట్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ ఎంపీలు రాహుల్ గాంధీ, శశి థరూర్, జైరాం రమేష్, మల్లికార్జున్ ఖర్గే, అధిర్ రంజన్ చౌధరి, కే సురేష్ ఓటు వేశారు.ఇక ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థిగా జగదీప్ ధన్‌కర్, విపక్షాల అభ్యర్థిగా మార్గరేట్ అల్వాలు పోటీపడుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్ జరగనున్నది. 780 మంది ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. దీంట్లో 543 మంది లోక్‌సభ, 245 మంది రాజ్యసభ ఎంపీలు ఉన్నారు.అయితే 36 మంది తృణమూల్ ఎంపీలు ఓటింగ్‌కు దూరంగా ఉండనున్నారు. రాజ్యసభలో 8 సీట్లు ఖాళీగా ఉన్నాయి. దీంతో 744 మంది ఎంపీలు ఓటు వేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర సమితితో పాటు జార్ఖండ్ ముక్తి మోర్చా, ఆమ్ ఆద్మీ పార్టీ, శివసేన ఉద్ధవ్ పార్టీలు మార్గరేట్ అల్వాకు మద్దతు ప్రకటించాయి.

# రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదే.. జవహర్



హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ న్యూడ్ వీడియో వైరల్ కావడంతో ప్రతిపక్షాలు వైసీపీ)పై దాడిని తీవ్రం చేశాయి. సోషల్ మీడియా వేదికగా పలువురు నాయకులు ఆ పార్టీని తూర్పార బడుతున్నారు. టీడీపీ మాజీ మంత్రి జవహర్ మాట్లాడుతూ.. "జగన్ రాష్ట్రాన్ని గాలికి వదిలేసి పబ్జి ఆడుకుంటుంటే.. మంత్రులు మహిళలను గంటల లెక్కన వేధిస్తున్నారు. రాష్ట్రంలో కీచక పాలన సాగుతోంది. మర్డర్లు, మానభంగాలు సర్వసాధారణం అయ్యాయి. జగన్ బలహీనతలు వైసీపీ నాయకులను నియంత్రించలేకపోతున్నాయి. ఇక రాష్ట్రాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత ప్రజలదే" అని పేర్కొన్నారు.

# వామ్మో కరోనా..

వేవ్ ఊసులేకుండానే వణికిస్తోంది! రాష్ట్రాలకు కేంద్రం లేఖ

ఢిల్లీ: క్రమక్రమంగా తగ్గుముఖం పడుతుందనుకున్న కరోనా.. తాజా కేసులు పెరిగిపోతుండడం కలవరపరుస్తోంది. నిత్యం 19వేలకు తక్కువ కాకుండా కేసులు నమోదు అవుతున్నాయి ఈ మధ్య. మరో వేవ్ ముప్పు తప్పినట్లేనని, వైరస్ ప్రభావం తగ్గిందని, వ్యాక్సినేషన్ ప్రభావంతో కరోనా కట్టడి జరుగుతుందని వైద్య నిపుణులు భావించారు ఇంతకాలం. అయితే కొత్త వేరియెంట్ ప్రస్తావన లేకుండా కొత్త కేసులు పెరిగిపోతుండడం కలవరపరుస్తోంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు లేఖలు రాసింది. కరోనా కేసులు పెరిగిపోతున్నందున కఠినంగా వ్యవహరించాలని రాష్ట్రాలను కోరింది. అంతేకాదు వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ట్రేసింగ్‌పై దృష్టి సారించాలని సూచించింది. ముఖ్యమంగా ఢిల్లీ, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిషా, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో కరోనా కేసులు క్రమం తప్పకుండా పెరుగుతూ పోతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శిలకు లేఖలు రాసింది.అంతేకాదు.. దేశంలో కొవిడ్-19 జబ్బుతో మరణించేవాళ్ల సంఖ్య సైతం యాభైకి తక్కువ కాకుండా నమోదు అవుతోంది. కాబట్టి, కరోనా ప్రొటోకాల్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రాలకు కేంద్ర వైద్య కార్యదర్శి లేఖలో కోరారు. తాజాగా గడిచిన 24 గంటల్లో.. 19,406 కొత్త కేసులు నమోదు అయ్యాయి. కరోనాతో దేశవ్యాప్తంగా 49 మంది మరణించారు. దీంతో కరోనాతో ఇప్పటివరకు దేశంలో నమోదు అయిన మరణాల సంఖ్య 5,26,649కి చేరింది. పాజిటివిటీ రేటు సైతం ఆందోళనకరంగానే ఉంది. అయితే అదే సమయంలో.. గత 24 గంటల్లో రికవరీల సంఖ్య 19,928కి పెరిగింది. దీంతో ప్రస్తుతం దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 1,35 వేల నుంచి లక్షా 34 వేలకు తగ్గిందని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది.

# ఢిల్లీకి ఏపీ సీఎం వైఎస్ జగన్



అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు రోజుల పర్యటనకు శనివారం ఢిల్లీకి వెళ్లనున్నారు. 6వ తేదీ సాయంత్రం విశాఖపట్నం నుంచి విమానంలో ఢిల్లీకి బయలుదేరుతారు. రాత్రికి వన్ జన్‌పథ్‌లో బస చేసి, 7వ తేదీ (ఆదివారం) ఉదయం 9.30 గంటలకు రాష్ట్రపతి భవన్ చేరుకుంటారు.ఆ తర్వాత నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు అక్కడ జరిగే నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ ఏడవ సమావేశంలో పాల్గొననున్నారు. అనంతరం తిరిగి తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు. కాగా.. సీఎం వైఎస్ జగన్ శనివారం శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస జూనియర్ కాలేజీ మైదానంలో జరగనున్న శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొననున్నారు.

# రాతపూర్వకంగా తలాక్‌నామా పంపడం చెల్లుబాటు కాదు

తేల్చిచెప్పిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు



అమరావతి ఆగష్టు 6 నోటి మాటగా మూడుసార్లు తలాక్ చెప్పడం ఇస్లాం చట్ట నిబంధనలకు విరుద్ధమైనప్పుడు, తలాక్‌నామా రూపంలో లిఖితపూర్వకంగా రాసుకున్నా కూడా చెల్లదని, వివాహం రద్దుకాదని హైకోర్టు తేల్చి చెప్పింది. ఏక వాక్యంలో మూడుసార్లు చెప్పే తలాక్‌కు ఎలాంటి గుర్తింపు లేదంది. మూడుసార్లు తలాక్ చెప్పి, దాన్ని రాతపూర్వకంగా పంపడం చెల్లుబాటు కాదని స్పష్టం చేసింది.ఒకవేళ ఇస్లాం చట్ట నిబంధనల ప్రకారం విడాకులు తీసుకోవాలంటే.. భార్య, భర్త ఇద్దరి తరపు మధ్యవర్తులు వారి మధ్య సయోధ్యకు ప్రయత్నించాలంది. అది సాధ్యం కానప్పుడే సహేతుక కారణాలతో తలాక్ చెప్పొచ్చునని, అలా చెప్పే తలాక్‌ల మధ్య తగిన వ్యవధి ఉండి తీరాలని తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిన్ రవినాథ్ తిల్హారీ ఇటీవల తీర్పు వెలువరించారు.వివరాల్లోకి వెళితే...తను, తన భర్త వేర్వేరుగా ఉంటున్న నేపథ్యంలో భర్త నుంచి జీవన భృతి ఇప్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పి.గౌస్‌బీ 2004లో పొన్నూరు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ అభ్యర్థనను ఆమె భర్త జాన్ సైదా వ్యతిరేకించారు. తాను తలాక్ చెప్పి, దాన్ని రిజిస్టర్ పోస్టులో భార్యకు పంపానని, అయితే అది తిరస్కరణ కారణంతో తిరిగి వచ్చిందని, కాబట్టి జీవన భృతి చెల్లించాల్సిన అవసరం లేదని సైదా వాదించారు.పొన్నూరు కోర్టు సైదా వాదనలను తోసిపుచ్చుతూ గౌస్‌బీ, ఆమె కుమారుడికి నెలకు రూ.8 వేలు జీవన భృతి కింద చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ జాన్ సైదా అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై విచారణ జరిపిన గుంటూరు మొదటి అదనపు సెషన్స్ కోర్టు, కుమారుడికి జీవనభృతి చెల్లించాలని, గౌస్‌బీకి అవసరం లేదంటూ తీర్పునిచ్చింది. దీనిని సవాలు చేస్తూ గౌస్‌బీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఈ వ్యాజ్యంపై జస్టిస్ రవినాథ్ తిల్హారీ విచారణ జరిపి ఇటీవల తీర్పు వెలువరించారు. గౌస్‌బీ, ఆమె కుమారుడికి జీవనభృతి చెల్లించాలంటూ పొన్నూరు కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించారు. భార్యకు మూడుసార్లు తలాక్ చెప్పి, దాన్ని రిజిస్టర్ పోస్టులో పంపి వివాహం రద్దయినట్లు పేర్కొనడాన్ని తప్పుపట్టారు. అలా చేయడం ద్వారా వివాహం రద్దు కాదన్నారు. భార్య, భర్త వేర్వేరుగా ఉంటున్నందున భర్త నుంచి భరణం పొందేందుకు ఆ మహిళ అర్హురాలేనని స్పష్టంచేశారు.

# ఢిల్లీలో చంద్రబాబును అవమానించిన ఎంపీ కేశినేని నాని



ఢిల్లీలో టీడీపీ జాతీయాధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకు తీరని అవమానం ఎదురైంది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన చంద్రబాబుకు సొంత పార్టీ ఎంపీ నుంచి అవమానం ఎదురవడంతో.. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీ పర్యటనకు వచ్చిన చంద్రబాబును స్వాగతం పలికేందుకు ఆయన పార్టీకే చెందిన ఎంపీ నిరాకరించినట్లుగా తెలుస్తున్నది.ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ నిర్వహణకు సంబంధించిన చర్చల్లో పాల్గొనాల్సిందిగా కేంద్రం నుంచి చంద్రబాబుకు ఆహ్వానం అందింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరుగనున్న సమావేశంలో పాల్గొనేందుకు చంద్రబాబు నాయుడు కొద్ది సేపటి క్రితం ఢిల్లీ వెళ్లారు. అయితే, ఢిల్లీకి వచ్చిన చంద్రబాబుకు ఆహ్వానం పలికేందుకు టీడీపీకి చెందిన ఎంపీ కేశినేని నాని సుముఖత చూపలేదని సమాచారం. పుష్పగుచ్ఛం ఇచ్చేందుకు నిరాకరించి చంద్రబాబును ఎంపీ కేశినేని నాని అవమానించినట్లు తెలిసింది. చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందించాలని మరో ఎంపీ గల్లా జయదేవ్ కోరినప్పటికీ కేశినేని నాని పెద్దగా పట్టించుకోలేదని అక్కడికి వచ్చిన వారు చెప్తుండటం విశేషం. కేశినేని నాని తీరుతో చంద్రబాబు నాయుడు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు.ఇటీవల కుటుంబంలో తలెత్తిన గొడవల్లో కేశినేని నాని సోదరుడికి చంద్రబాబు నాయుడు మద్దతు ఇచ్చారు. ఈ విషయమై ఇప్పటికే చంద్రబాబుతో కేశినేని నాని వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. తన సోదరుడికి చంద్రబాబు మద్దతు ఇవ్వడంపై కేశినేని నాని బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఢిల్లీకి వచ్చిన చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికేందుకు కేశినేని నాని నిరాకరించినట్లుగా ఇక్కడి టీడీపీ నేతలు చర్చించుకుంటున్నారు.

# హర్ ఘర్ తిరంగా ఘనంగా నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం




విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో 'హార్ ఘర్ తీరంగా' ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వాప్తంగా కోటి జాతీయ జెండాలు ఎగరేసేలా ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 11 నుంచి 15 వరకు రాష్ట్రంలో హార్ ఘర్ తీరంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. 12న జరిగే హార్ ఘర్ తిరంగాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొననున్నారు. ఇప్పటికే కోటి జెండాలను వివిధ శాఖల ద్వారా కొనుగోలుకు ఆదేశాలు జారీ చేసింది. వీటిని గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా పంపిణీ చేయాలని ఆదేశించింది.కాగా భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 యేళ్లు పూర్తి కావొస్తోన్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా హార్ ఘర్ తిరంగా అంటూ ప్రతి ఇంటిపై జెండా ఎగిరేసేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# మోడీ, జగన్ ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయి: తులసిరెడ్డి

అమరావతి: ముఖ్యమంత్రి జగన్ ప్రగతి నిరోధకుడుగా మారారని కాంగ్రెస్ కమిటీ కార్య నిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా విడుదల చేయాల్సిన రూ.1798 కోట్లు విడుదల చేయలేదన్నారు. రాష్ట్రంలో రూ.1.33 లక్షల కోట్లు విలువచేసే కేంద్ర ప్రాజెక్టులు ఆగిపోవడం దురదృష్టకరమన్నారు. అలాగే హాస్టళ్లలో 5 సంత్సరాలుగా మెస్ చార్జీలు పెంచలేదన్నారు. వంట గ్యాస్, కంది పప్పు, నూనెలు తదితర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇంకా 903121 మంది అగ్రిగోల్డ్ బాధితులకు రూ. 3039 కోట్లు చెల్లించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొందూదొందేనని ఆయన విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరల పెంపు, నిరుద్యోగ సమస్యను పెంచారని తులసిరెడ్డి మండిపడ్డారు. భారాలు మోపడంలో మోడీ, జగన్ ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయని విమర్శించారు.



# మహారాష్ట్ర సీఎం , డిప్యూటీ సీఎంకు టీటీడీ ఆహ్వానం

తిరుమల : ముంబైలో టీటీడీ నిర్మించనున్న శ్రీవారి ఆలయ భూమి పూజ కార్యక్రమానికి హాజరు కావాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే , ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ను టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి , ఈవో ఎ వి ధర్మారెడ్డి ఆహ్వానించారు . ఈ మేరకు శనివారం వీరు ముంబైలో సీఎం, డిప్యూటీ సీఎంను కలిసి శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఆగస్టు 21న ముంబైలో ఆలయ భూమి పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు . ముంబైలో శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం మహారాష్ట్ర ప్రభుత్వం టీటీడీ కి 10 ఎకరాల భూమి అప్పగించింది . కాగా రేమండ్స్ కంపెనీ అధినేత గౌతం సింఘానియా ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చిన విషయం తెలిసిందే



# సంపాదకీయం

ఆదివారం 07-08-2022

## ఆల్ ఖైదా అధ్యాయం ముగిసినట్టేనా

బిన్ లాడెన్ హతుడైన తర్వాత నుంచి అల్ ఖైదాకు నాయకత్వం వహిస్తున్న అల్ జవహరిని, అఫ్ఘనిస్తాన్‌లోని అతడి స్థావరంపై డ్రోన్ దాడి చేసి అమెరికా హతమార్చింది. ప్రపంచ టెర్రరిస్ట్ నేతల్లో అగ్రగణ్యుడైన జవహరి హత్యను అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తన ప్రభుత్వ ఘన విజయంగా చాటుకొన్నారు. అమెరికాకు హాని తలపెట్టే వారందరికీ చెబుతున్నాను, వినండి, మేమెప్పుడూ అప్రమత్తంగా ఉంటాం, స్వదేశంలో, ప్రపంచమంతటా గల అమెరికన్ల రక్షణ, భద్రతలకు హామీ ఇస్తూ అందుకు అవసరమైన చర్యలు తీసుకొంటాం' అని బైడెన్ సోమవారం నాడు జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో పేర్కొన్నారు. అమెరికా, దాని మిత్ర దేశాలపై దాడులు చేయాలని జవహరి తన అనుచరులకు ఇటీవల విజ్ఞప్తి చేసినట్టు వైట్ హౌస్ సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలియజేసింది.అల్ జవహరిని అఫ్ఘాన్ రాజధాని కాబూల్‌లోని ఒక భవనం బాల్కనీలో ఉండగా తమ దళాలు డ్రోన్ దాడి చేసి చంపేశాయని వైట్ హౌస్ వర్గాలు తెలియజేశాయి. ఈ ఘటనలో ఒక్క అమెరికన్ సైనికుడి పాదముద్ర కూడా అక్కడి నేల మీద పడలేదని, అలాగే ఇతరులెవ్వరికీ ప్రాణహాని కలుగలేదని వెల్లడించాయి. జవహరిని కాబూల్‌లో ఉండడానికి అనుమతించడం దోహా ఒప్పందానికి ఉల్లంఘన అని వైట్ హౌస్ సీనియర్ అధికారి వ్యాఖ్యానించారు. అఫ్ఘాన్‌లో టెర్రరిస్టులకు ఆశ్రయం ఇవ్వరాదన్న షరతు మీదనే అక్కడి నుంచి అమెరికా సేనల ఉపసంహరణకు అంగీకరిస్తూ తాలిబాన్లతో 2020లో దోహాలో ఒప్పందం కుదిరిందని ఆ అధికారి వెల్లడించారు. అదే ఏడాది అధ్యక్ష పదవి ఎన్నికల్లో బైడెన్ ప్రచారం చేస్తూ ఇరాన్ సైన్యాధ్యక్షుడు జనరల్ ఖాసిమ్ సొలేమనీని హత్య చేయించినందుకు అప్పటి అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను తప్పుపట్టారు.ఇప్పుడు బైడెన్ కూడా అదే పని చేశారు. దక్షిణాసియా అంతటా అమెరికా సైనికులపై దాడులకు బాధ్యుడని భావించి సొలేమనీని ట్రంప్ ఇరాక్‌లో చంపించారు. ఆ చర్య వల్ల ఇరాన్‌తో యుద్ధం ముంచుకు రాగలదని బైడెన్ అప్పుడు హెచ్చరించారు. అమెరికన్ సైనికులు ఇతర దేశాల్లో ప్రాణ త్యాగం చేయవలసిన పరిస్థితి రానీయరాదని అమెరికా తీర్మానం చెప్పుకోడం, అందుకనుగుణంగా అన్ని యుద్ధ క్షేత్రాల నుంచి సైనికులను ఉపసంహరించుకోడం జరిగింది. ప్రస్తుతం ఉక్రెయిన్ –రష్యా యుద్ధంలో కూడా అమెరికా ప్రత్యక్షంగా సైన్యాన్ని పంపించకుండా ఉక్రెయిన్‌కు భారీ ఆయుధ సాయం చేస్తున్నది. కాబూల్ లో జవహరి హత్య అల్ ఖైదాను రెచ్చగొట్టడం ఖాయం. నాయకుడిని కోల్పోయిన ఆ ఉగ్రవాద సంస్థ నామరూపాలు లేకుండా పోతుందో, పగతో మరింత బలపడుతుందో చూడాలి. 2021 ఆగస్టు 31న హడావుడిగా అఫ్ఘాన్‌ను అమెరికా సేనలు విడిచిపెట్టిన తర్వాత అమెరికా బయటి దేశంలో సైనిక దాడికి పాల్పడడం ఇదే తొలిసారి.అమెరికన్ పార్లమెంటుకు జరగబోయే ఎన్నికల్లో తన పార్టీని నెగ్గించుకోడానికి తురుపు ముక్కగా ఉపయోగపడుతుందనే ఉద్దేశంతోనే బైడెన్ ఈ దాడి జరిపించారు. వాస్తవానికి ఆయన అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత అమెరికా ప్రజల్లో ఆయన ప్రతిష్ఠ పెరగకపోగా మసకబారిందనే అభిప్రాయం ఏర్పడింది. ఇంతకాలం రహస్యంగా ఉన్న జవహరి ఉనికి ఇప్పుడు అమెరికన్లకు ఇంత గురి తప్పకుండా ఎలా తెలిసిందనేది ముఖ్యమైన ప్రశ్న. కైరోలో డాక్టర్‌గా చేస్తూ 1980లో అఫ్ఘాన్ చేరుకొని జిహాదీ టెర్రరిస్టుల్లో చేరిన జవహరి అమెరికాతో ఢీ కొనే వ్యూహ రచనలో దిట్ట అనిపించుకున్నాడు. బిన్ లాడెన్ కుడి భుజంగా 2001, సెప్టెంబర్ 11న అమెరికన్ జంట ప్రాసాదాలపై జరిగిన దారుణాతి దారుణ దాడిలో జవహరి కీలక పాత్ర పోషించాడని భావిస్తారు. పట్టపగలు విమానాలను పేల్చడం ద్వారా జరిపిన ఆ ఆత్మాహుతి దాడిలో 3000 మంది దుర్మరణం పాలయ్యారు. ప్రపంచంలోని ఉగ్రవాద సంస్థల్లోకెల్లా బలమైనది అల్ ఖైదా, జవహరి నాయకత్వంలో హింసోన్మత్తతలో ఆరితేరిందని చెబుతారు.భారత దేశంలో కూడా వ్యాపించిందని ఇక్కడి నుంచి కొద్ది మందిని రిక్రూట్ చేసుకొన్నదని సమాచారం. ముఖ్యంగా 2011 నాటి అరబ్ స్ప్రింగ్ తిరుగుబాట్లు బలపడి వామపక్ష భావజాలం వైపు మొగ్గకుండా చూసి ఆ శక్తులను అల్ ఖైదా వైపు జవహరి మళ్లించాడని సమాచారం. పాకిస్థాన్‌లో బిన్ లాడెన్ స్థావరం మీద అమెరికన్ సైన్యం దాడి చేసి అతడిని చంపేసిన తర్వాత జవహరి అల్‌ఖైదా అధినేత అయ్యాడు. శత్రు శేషాన్ని ఉంచరాదనే దృష్టితో జవహరిని అమెరికా ఇప్పుడు మట్టుబెట్టింది. అయితే నిజంగానే అమెరికా శత్రు నిశ్శేషం అవుతుందా? లేక దానికి, మన వంటి దేశాలకు ఉగ్రవాద భయం పెరుగుతుందా? జవహరి ఆచూకీని అఫ్ఘాన్ ప్రభుత్వమే తెలియజేసి ఉంటే వేరు మాట. లేకపోతే తాలిబాన్ పాలకులు అల్ ఖైదాకు ఆశ్రయం ఇస్తున్నారని రూఢిగా భావించక తప్పదు. ఇది అమెరికాకే కాకుండా ఇండియాకు కూడా ఉగ్రదాడుల భయాన్ని పెంచుతుంది. సంహారం ఒక్కటే అంతర్జాతీయ ఉగ్రవాదానికి పరిష్కారం చూపదు.

# వైసీపీలో కాంతదాసులు...



విజయవాడ, ఆగస్టు 6, ముఖ్యమంత్రి పీఠం కోసం వైయస్ జగన్.. సోనియాగాంధీని ఎదిరించాడు... ఓదార్పు యాత్రకు శ్రీకారం చుట్టాడు. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ పేరు తలగడంతో.. ఆయనని సంప్రదించాడు. అయితే ఈ కోర్సు చాలా చాలా కష్టంతో కూడుకున్నదని... ఆ క్రమంలో వేలకు వేల కిలోమీటర్ల మేర పాదయాత్ర చేయాలి... ప్రజలకు ముద్దులు పెట్టాలి.. తలలు నిమరాలి.. తలపై చేతులు పెట్టాలి.. ఒక్కరు ఉన్నా.... వంద మంది ఉన్నా.. వేలా మంది ప్రజలు ఉన్నా.. చెప్పిందే చెప్పుకొంటూ పోవాలి.. అంటూ కండిషన్లు పెట్టడమే కాదు.. అందుకు కోర్సు సమయంతో పాటు వందల కోట్లలో ఫీజు సైతం వసూల్ చేశాడనే ఓ టాక్ 2019 ఎన్నికల వేళ.. ఆంధ్రప్రదేశ్ నుంచి బీహార్ వరకు జోరుగానే వైరల్ అయింది. ప్రతిపక్షనేత స్థానం నుంచి ముఖ్యమంత్రి పీఠం ఎక్కేందుకు వైయస్ జగన్ పడిన కాయకష్టం తాలుక ఎపిసోడ్ ఒక ఎత్తు అయితే.. ఆ మహానేత కుమారుడు ఈ జననేత పడిన కష్టాన్ని ఆయన పార్టీలోని నేతలే గుర్తించడం లేదు సరికదా.. మరోసారి తమ అధినేత వైయస్ జగన్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా ఉండేందుకు.. ఎంత చేయాలో అంతా చేసేస్తున్నారు. ఇంకా క్లియర్ కట్‌గా చెప్పాలంటే.. వైయస్ జగన్ భవిష్యత్తుని దుంప నాశనం చేసేందుకు టాలీవుడ్ కమెడియన్ పృథ్వీ రాజ్, జగన్ తొలి కేబినెట్‌లో మంత్రి అవంతి శ్రీనివాస్, మలి కేబినెట్‌లో మంత్రి అంబటి రాంబాబు, తాజాగా హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ ఎక్స్‌ట్రా ఎక్స్‌ట్రా కంకణం కట్టుకొన్నారని వైసీపీ శ్రేణులే జోకులేసుకుంటున్నాయి.జగన్ అదికారంలోకి వచ్చిన తర్వాత టాలీవుడ్ నటుడు, థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీ రాజ్ ని శ్రీవెంకటేశ్వర భక్తి చానల్ చైర్మన్ పోస్ట్‌లో నియమించారు సీఎం జగన్. ఇలా తిరుమల కొండెక్కి శ్రీవారిని దర్శించుకొని అలా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత ఈ థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీరాజ్ .. ఓ మహిళా ఉద్యోగితో అసభ్యంగా మాట్లాడుతున్న ఫోన్ కాల్‌కు సంబంధించిన ఆడియో అటు సోషల్ మీడియాలో ఇటు మీడియాలో లీక్ అయి వైరల్ అంది. అంతే ఆయన ఆ పదవికే గోవిందా గోవిందా అంటూ గంట కొట్టి మరీ మంగళహారతి ఇచ్చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు థర్టీ ఈయర్స్ ఇండస్ట్రీ పృథ్వీ మరికొద్ది కాలం ఈ చైర్మన్‌గిరిలో ఉంటే. ఈ భక్తి చానల్ కాస్తా రక్తి చానల్‌గా మార్చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదనే ఓ టాక్ తిరుపతిలోని ఆలిపిరి శ్రీవారి పాదాల సాక్షిగా గట్టిగానే వినిపించింది. ఇక ఆ తర్వాత సత్తెనపల్లి ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి అంబటి రాంబాబు... నాడు ఓ మహిళతో ఫోన్‌లో మాట్లాడుతూ.. మసాజ్ అంటూ.. అర గంట.. గంట అంటూ మాట్లాడిన మాటలు సైతం రచ్చ రచ్చ చేసి వదిలాయి. కానీ రాంబాబు.. మహాగట్టివాడు.. ఇంకా చెప్పాలంటే.. గట్టిపిండం.. తన వాయిస్ కాదు.. ఎవరో మిమిక్రి చేశారంటూ తన మాటల గారిడీతో బుకాయించేశానే. ఆ తర్వాత సీఎం జగన్ కూడా ఇవేమి పట్టించుకోకుండా.. తన మలి కేబినెట్‌లో అంబటికి జలవనరుల శాఖ మంత్రిగా ప్రమోషన్ ఇచ్చేశారు. ఆ క్రమంలో అంటే అంబటి రాంబాబు ఆడియో లీక్ అయిన్ జస్ట్ వారం రోజులకే నాటి పర్యాటక శాఖ మంత్రిగా ఉన్న.. అవంతి శ్రీనివాస్ రావు... ఓ మహిళతో మాట్లాడుతున్న ఆడియో లీక్ అయి.. రచ్చ రచ్చ చేసి పెట్టింది. కానీ ఆయన మంత్రి పదవికి ఎసరు రాలేదు.. అలాగే ఎమ్మెల్యే పదవి సైతం యాజ్ ఇట్ ఈజ్‌గా ఉంది. ఇక తాజాగా హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్.. వీడియో కాల్ అయితే.. మీడియాలోనే కాదు.. సోషల్ మీడియాలో సైతం రచ్చ రంబోలా చేసి పోరేస్తోంది. దీనిపై ఇప్పటికే ఎంపీ గోరంట్ల.. ఇది ఫేక్ వీడియో.. తాను జిమ్ చేస్తున్న వీడియోను టీడీపీ వాళ్లు ఇలా మార్ఫింగ్ చేశారంటూ మీడియా ముందుకొచ్చి మరీ చెప్పారు. అంతేకాకుండా దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామని చెప్పారు.కానీ గోరంట్ల బాగోతం వీడియో సాక్షిగా లీక్ కావడంతో.. దీనిపై ముఖ్యమంత్రి వైయస్ జగన్ సీరియస్ అయినట్లు తెలుస్తోంది. ఆ క్రమంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో సీఎం జగన్ భేటీ అయి.. చర్చించినట్లు సమాచారం. కానీ అప్పటికే జరగాల్సిన డ్యామేజి జరిగిపోయింది. అయితే సజ్జల మీడియా సాక్షిగా మాట్లాడుతూ.. గోరంట్ల వీడియో నిజమైతే.. ఆయనపై పార్టీ కచ్చితంగా చర్యలు తీసుకొంటుందంటూ చెప్పుకొచ్చారు. మరోవైపు.. వైయస్ జగన్ పార్టీలో కాంతా దాసుల సంఖ్య భారీగా ఉందన్న ప్రచారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. మరోవైపు.. జగన్ పార్టీకి ప్రతిపక్ష పార్టీల పోరు.. హోరు ఏమో కానీ.. సొంత పార్టీలోని రసిక రాజాల తాలుక ఫోన్ కాల్స్.. వీడియో కాల్స్‌తో గెలుపు అడ్రస్ గల్లంతు అయినా ఆశ్చర్య పడనక్కర్లేదని పార్టీ శ్రేణులే అంతర్గత సంభాషణల్లో చెప్పుకుంటున్నారు.

# గోరంట్లపై విజయ్ పరువునష్టం దావా

విశాఖపట్టణం, ఆగస్టు 6, ఎంపీ గోరంట్ల మాధవ్ పై తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి చింతకాలయ విజయ్ రూ. 50లక్షలకు పరువు నష్టం దావా వేశారు చింతకాయల అయ్యన్న పాత్రుడు కుమారుడైన చింతకాలయ విజయ్ ఈ సందర్భంగా మరోసారి గోరంట్ల మాధవ్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.అసహ్యకరంగా వీడియోకాల్ లో మాట్లాడటమే కాకుండా.. బుకాయింపు కూడానా అని గోరంట్లపై మండి పడ్డారు. తనపై మీడియా సమావేశంలో ఆరోపణలు చేసినందుకే మాధవ్ పై పరువునష్టం దావా వేసినట్లు చెప్పారు. ఎంపీ హోదాలో ఉన్న గోరంట్ల మాధవ్ చేసిందే దగుల్బాజీ పని.. నగ్నంగా మహిళలో వీడియో కాల్ మాట్లాడుతూ దొరికిపోయిన ఆయన సిగ్గుతో తలదించుకోవలసింది పోయి నా పై ఆరోపణలు చేయడవేమిటని నిలదీశారు.ఎంత ఎంపీ అయినా.. చట్టం ముందు ఆయన సామాన్యుడేనని చింతకాలయ విజయ్ అన్నారు. దిక్కుమాలిన పని చేసి తమపై నిందలేయడం దారుణమన్నారు. పవిత్రమైన పార్లమెంటు సభ్యుడిగా ఉంటూ.. గోరంట్ల మాధవ్ దిక్కుమాలిన పని చేసి దొరికిపోవడమే కాక.. తెలుగుదేశం పార్టీ నేతలపై, మీడియాపై నిందలేయడం సిగ్గుచేటన్నారు. ఎంపీ మాధవ్ ఢిల్లీలో ప్రెస్ మీట్ పెట్టి తనకు సంబంధించిన వీడియో బయటకు తెచ్చింది తానే అనడం సరికాదన్నారు. అసలు ఆ వీడియోకు, తనకు ఏం సంబంధమో ఆయనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక పార్లమెంటు సభ్యుడిగా ఉన్న వ్యక్తికి నీతి, నిజాయితీ అనేవి లేవా అన్నారు. ఒక ఎంపీకి సంబంధించిన ప్రైవేటు వీడియోకు, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శికి ఏం సంబంధమో సమాధానం చెప్పాలన్నారు. ఒక పౌరుడిగా, కుటుంబంలోని వ్యక్తిగా, పార్లమెంటు సభ్యుడిగా ఆయన కుటుంబానికి, ఓట్లేసిన ప్రజలకు, దేశానికి సమాధానం చెప్పడం పోయి.. తనను విమర్శించడమేంటి అన్నారు. తాను తప్పు చేయలేదని చెప్తే సరిపోతుందా.. ఫోరెన్సిక్ పరీక్షలకు పంపిస్తానని చెబుతున్నపుడు..

ఆ పని చేయకుండా భయపడాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు.మాధవ్ సుందర ప్రతి బింబాన్ని చూసేందుకు ఎవరికీ అంత గుండె ధైర్యం లేదంటూ ఎద్దేవా చేశారు. పార్లమెంటులో ఏపీ పరువు తీశారన్నారు. 25 ఎంపీలు ఇవ్వండి ప్రత్యేక హోదా తీసుకొస్తానని వారి నాయకుడు అంటే.. జనం నమ్మి సీట్లిస్తే.. ఇదా ప్రత్యేక హోదా అటూ ప్రశ్నించారు. ఇలాంటి న్యూడ్ వీడియోలేనా వారు తెచ్చే స్పెషల్ స్టేటస్.? ఇదేనా సాధిస్తామన్న రైల్వే జోన్.? ఇవేనా వెనుకబడిన జిల్లాలకు తెస్తామన్న కేంద్ర నిధులు అంటూ ధ్వజమెత్తారు. ప్రెస్ మీట్ పెట్టి మరీ తన పేరు చెప్పినందుకే పరువునష్టం దావా వేశానని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంటు ప్రివిలేజ్ కమిటీకి కూడా ఫిర్యాదు చేస్తానన్నారు. మాధవ్‌పై అధినేత జగన్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని విజయ్ ప్రశ్నించారు.

# కుప్పం లెక్కలు అంత వీజీనా

తిరుపతి, ఆగస్టు 6, ఏపీలో 2024 ఎన్నికల వేడి రాజుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే గత ఆనవాయితీకి భిన్నంగా టీడీపీ అధినేత, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు వ్యూహరచన చేస్తున్నారు. ఎన్నికలకు చాలా నెలల ముందుగానే కొందరు అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తున్నారు. ఇక, చంద్రబాబును ఫాలో అవుతున్న జగన్? నియోజకవర్గాల వారీగా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలోనే తొలి నియోజకవర్గంగా కుప్పాన్ని ఎంచుకున్న జగన్ ఏకంగా చంద్రబాబుపై అభ్యర్థిని ప్రకటించి ఆపరేషన్ కుప్పం మొదలు బెట్టారు.టీడీపీ అధినేత చంద్రబాబు కంచుకోట అయిన కుప్పంలో గెలుపే లక్ష్యంగా జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కుప్పం తన సొంత నియోజక వర్గంతో సమానమన్న జగన్?కుప్పం అసెంబ్లీ నియోజకవర్గం తరఫున 2024 ఎన్నికల్లో బరిలోకి దిగనున్న భరత్ ను గెలిపించాలని కోరారు. అంతేకాదు, భరత్ ను గెలిపిస్తే ఆయనకు మంత్రి పదవి గ్యారెంటీ అంటూ చేస్తున్నామన్నారు. కుప్పాన్ని రెవెన్యూ డివిజన్ చేశానని చెప్పిన జగన్?తాజాగా కుప్పం మున్సిపాలిటీకి సంబంధించి 65 కోట్ల విలువైన పనులకు నిధులను మంజూరు చేశారు. అయితే, కుప్పంలో చంద్రబాబును ఓడించం అంత సులువు కాదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు కంచుకోట అయిన కుప్పంలో ఆయన వరుసగా 7 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. కొద్ది నెలల క్రితం జరిగిన స్థానిక– మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ ఏకపక్షంగా విజయం సాధించడంతో రాబోయే ఎన్నికల్లోనూ అదే ఊపు కొనసాగిస్తామని వైసీపీ నేతలు అంటున్నారు. కానీ, అది అంత సులువు కాదు.కుప్పంలో ఎన్నికలు దాదాపు ఏకపక్షంగా జరుగుతుంటాయి.1962 నుంచి చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో అత్యధిక సార్లు ప్రజలు టీడీపీకే విజయాన్ని కట్టబెట్టారు. ఇక్కడ జరిగిన 12 ఎన్నికల్లో టీడీపీ ఏడుసార్లు గెలిచింది. 1985లో టీడీపీ అభ్యర్థిగా రంగంలోకి దిగిన రంగస్వామినాయుడు ఇక్కడ విజయం సాధించారు. తర్వాత 1989లో చంద్రబాబు తొలిసారి చంద్రగిరి నుంచి కుప్పం వెళ్లి పోటీ చేసి గెలిచారు. ఇక అప్పటి నుంచి కుప్పం నుంచి చంద్రబాబు అప్రతిహత జైత్రయాత్ర కొనసాగిస్తున్నారు.దాదాపు 2 లక్షల పైచిలుకు ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు లక్ష 5 వేలు కాగా.. మహిళలు లక్షా 3 వేలు ఉన్నారు. ఓటర్లలో ప్రధానంగా అగ్రవర్ణాలతో పాటు దాదాపు లక్ష మంది బీసీ ఓటర్లు కూడా ఉన్నారు. వీరంతా కొన్నేళ్లుగా టీడీపీకి అండగా ఉన్నారు. అందుకే టీడీపీ అధినేత ఇక్కడ వరుసగా విజయాలు అందుకుంటున్నారు. వ్యవసాయం, గ్రానైట్ క్వారీలపై ఆధారపడిన కుప్పం ప్రజలకు చంద్రబాబు రెండు దశాబ్దాలుగా ఆశాదీపంలా ఉన్నారు. కుప్పంలో చంద్రబాబు చేసిన అభివృద్ధే ఆయన వరుస విజయాలకు కారణం.కుప్పంలో చంద్రబాబు ప్రచారం చేయకపోయినా కొన్నేళ్లుగా ఆయన్నే వారు గెలిపిస్తూ వస్తున్నారంటే ఇది టీడీపీకి కంచుకోట అని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. కంచుకోటను జగన్, భరత్ లు బద్దలు కొడతామని చెప్పడం హాస్యాస్పదం. అయితే, ప్రత్యర్థిని తక్కువ అంచనా వేయకూడదన్న సూత్రాన్ని నమ్మే చంద్రబాబు ఈ సారి కుప్పంలో భారీ మెజారిటీ సాధించేందుకు కచ్చితంగా గట్టి ప్రయత్నాలు చేస్తారనడంలో సందేహం లేదు.

# ఎంపీల్లో సీటు టెన్షన్

నెల్లూరు, ఆగస్టు 6, నెక్స్ట్ ఎన్నికల్లో మళ్ళీ గెలిచి అధికారంలోకి రావడమే లక్ష్యంగా సీఎం జగన్ దూకుడుగా రాజకీయం చేస్తున్నారు..ఇంతకాలం ప్రభుత్వ కార్యక్రమాలతో ఫుల్ బిజీగా ఉంటూ..ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే పనిలో ఉన్న జగన్..ఇకపై ప్రభుత్వంతో పాటు పార్టీ కార్యక్రమాల్లో దూకుడుగా ఉండాలని డిసైడ్ అయ్యారు. ఇప్పటికే 175 సీట్లు గెలవాల్సిందే అని టార్గెట్ పెట్టుకున్న విషయం తెలిసిందే. ఆ దిశగానే ఎమ్మెల్యేలు పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఎమ్మెల్యే?గడప గడపకు వెళ్ళి ప్రజల మద్ధతు పెంచుకోవాలని సూచించారు. అలాగే సరిగ్గా పనిచేసిన వారికే నెక్స్ట్ ఎన్నికల్లో సీటు ఇస్తానని కూడా తేల్చి చెప్పేశారు. ఈ విషయంలో ఎలాంటి మొహమాటం ఉండదని జగన్ చెప్పారు.సరిగ్గా పనిచేయకపోతే నెక్స్ట్ ఎన్నికల్లో సీటు ఉండదు?ఇందులో ఎలాంటి డౌట్ లేదు?అయితే ఈ కండిషన్ ఎమ్మెల్యేలకు మాత్రమే కాదు..ఎంపీలకు కూడా ఉంది. ఎమ్మెల్యేలు గెలవడం ఎంత ముఖ్యమో ఎంపీలు గెలవడం కూడా అంతే ముఖ్యం. ఎంపీ స్థానాల్లో బలమైన నాయకులు ఉంటే?ఎమ్మెల్యేల గెలుపుపై ప్రభావం చూపించే ఛాన్స్ ఉంది. ఈ సారి కేంద్రంలో బీజేపీకి పూర్తి మెజారిటీ వచ్చేలా లేదు?కాబట్టి ఈ సారి ఎక్కువ ఎంపీలు గెలిస్తే వైసీపీకే అడ్వాంటేజ్ ఉంటుంది.అందుకే జగన్ ఎంపీలపై కూడా ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది?సరిగ్గా పనిచేయని ఎంపీలని పక్కన పెట్టి కొత్తవారికి అవకాశాలు ఇవ్వొచ్చని తెలుస్తోంది. వాస్తవానికి గత ఎన్నికల్లో కూడా ఎంపీ స్థానాల్లో కొత్త అభ్యర్ధులని పెట్టి జగన్ సక్సెస్ అయ్యారు?ఈ సారి కూడా కొన్ని మార్పులు చేసే ఛాన్స్ ఉంది. వాస్తవానికి వైసీపీలో చాలామంది ఎంపీలు హైలైట్ కాలేదని చెప్పొచ్చు?ఏదో అయిదారుగురు ఎంపీలు తప్ప?మిగిలిన వారు ప్రజలకు పెద్దగా తెలియడం లేదు. అలాగే పనితీరు విషయంలో కూడా కొందరు ఎంపీలు ఫెయిల్ అవుతున్నారు.అలాంటి వారిని జగన్ పక్కన పెట్టేయాలని డిసైడ్ అయ్యారని తెలుస్తోంది. కచ్చితంగా ఎంపీ స్థానాల్లో పెద్ద మార్పు ఉంటుందని సమాచారం..మరి ఈ సారి ఎంపీ సీట్లు కోల్పోయేది ఎవరో చూడాలి.

## ఆదానీ గ్రూపుకు ఏపీ రోడ్లు

నెల్లూరు, ఆగస్టు 6, ఆదానీ గ్రూప్ ఆంధ్రప్రదేశ్, గుజరాత్‌ల్లో 972 కిలోమీటర్ల పొడవైన నాలుగు టోల్‌వే ప్రాజెక్టులను రూ.3,110 కోట్లతో కొనుగోలు చేస్తోంది. మక్వారీ ఏషియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ అనుబంధ సంస్థలైన.. గుజరాత్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ లిమిటెడ్ (జీఆర్ఐసీఎల్), స్వర్ణ టోల్‌వే ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్‌టీపీఎల్) నుంచి అదానీ గ్రూప్ ఈ నాలుగు టోల్‌వేలను కొనుగోలు చేస్తోంది. ఇందు లో ఎస్‌టీపీ ఎల్‌కు ఆంధ్రప్రదేశ్ లోని రెండు టోల్‌వే ప్రాజెక్టు ల్లో నూరు శాతం వాటా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని తడ–నెల్లూరు (110 కిలోమీటర్లు), నందిగామ –ఇబ్రహీంపట్నం–విజయవాడ (48 కిలోమీ టర్లు) ప్రాజెక్టులు అదానీ గ్రూప్‌నకు మరింత కీలకం కానున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన టోల్‌వే ప్రాజెక్టులను చేజిక్కించుకుంది. ఈ 110 కిలోమీటర్ల పొడవైన టోల్‌వేలో మొత్తం మూడు టోల్ ప్లాజాలు ఉన్నాయి. కృష్ణపట్నం రేవుకు వచ్చిపోయే వాహనాలతో పాటు ఏపీ నుంచి చెన్నై వచ్చిపోయే వాహ నాలతో ఈ రహదారి టోల్‌వే ద్వారా వెళ్లే వాహనాల టోల్ కలెక్షన్లు ఇకఅదా గ్రూప్‌ఖాతాలోపడ నున్నాయి. దక్షిణ భారత్‌లోని ప్రధాన మెట్రో నగరాలను అనుసంధానం చేసే విజయవాడ సమీపంలోని నంది గామ–ఇబ్రహీంపట్నం–విజయవాడ టోల్‌ప్రాజెక్ట్ ద్వారానూ అదానీ గ్రూప్‌నకు మంచి ఆదాయమే వస్తుందని భావిస్తున్నారు. చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి (ఎన్‌హెచ్–16) ట్రాఫిక్‌కు ప్రధాన ఊతం. రెగ్యులేటరీ సంస్థల నుంచి అనుమతి లభిస్తే వచ్చే నెలాఖరు కల్లా ఏపీ, గుజరాత్‌ల్లోని ఈ నాలుగు టోల్‌వేలు అదానీ గ్రూప్ చేతికి వస్తాయి.

## కాపు ఎమ్మెల్యేలకు గ్లాసు టెన్షన్

కాకినాడ, ఆగస్టు 6, సొంతవర్గానికి చెందిన పవన్ కల్యాణ్ పేరు చెబితే చాలు?చాలామంది కాపు ఎమ్మెల్యేలు టెన్షన్ పడుతున్నారట. గత ఎన్నికల్లో ఆయన ఒంటరిగా పోటీ చేయడం వల్ల ఓట్లు చీలిపోయి?తమ గెలుపు సాధ్యమైందని, ఈ సారి గాని పవన్..టీడీపీతో కలిస్తే తమ గెలుపు కష్టమే అని వైసీపీ కాపు ఎమ్మెల్యేల్లో బాగా టెన్షన్ పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో వాస్తవం లేకపోలేదు. గత ఎన్నికల్లో జనసేన విడిగా పోటీ చేయడం వల్ల ఓట్లు చీలిపోయి..వైసీపీ గెలిచేసింది.అంటే టీడీపీపై వైసీపీకి వచ్చిన మెజారిటీ కంటే జనసేనకు ఎక్కువ ఓట్లు పడిన నియోజకవర్గాలు చాలానే ఉన్నాయి?వాటిల్లో కాపు ఎమ్మెల్యేలు గెలిచిన స్థానాలు కూడా ఉన్నాయి. అందుకే ఈ సారి కూడా పవన్ ఒంటరిగా పోటీ చేస్తే బాగుండు అని వైసీపీ కాపు ఎమ్మెల్యేలు అనుకునే పరిస్తితి. అలా కాకుండా పవన్..టీడీపీతో కలిస్తే మెజారిటీ కాపు ఎమ్మెల్యేలు అస్సామే. గత ఎన్నికల్లో మొత్తం 30 మంది కాపు ఎమ్మెల్యేలు గెలిచారు. అందులో టీడీపీ నుంచి గెలిచిన నిమ్మల రామానాయుడు, గంటా శ్రీనివాసరావు, నిమ్మకాయల చినరాజప్పని పక్కన పెడితే?వైసీపీకి చెందిన 27 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.వీరిలో పవన్ వల్ల ఎక్కువ టెన్షన్ పడేది..అంబటి రాంబాబు, దూలం నాగేశ్వరావు, పేర్ని నాని, సింహాద్రి రమేష్, ఆళ్ళ నాని, కొట్టు సత్యనారాయణ, గ్రంథి శ్రీనివాస్, పుప్పాల వాసు, శ్రీనివాస్ నాయుడు, కన్నబాబు, దొరబాబు, జక్కంపూడి రాజా, పర్వత ప్రసాద్, అవంతి శ్రీనివాస్, గుడివాడ అమర్నాథ్?ఈ ఎమ్మెల్యేలకు పవన్ వల్ల టెన్షన్ ఎక్కువ.ఎందుకంటే గత ఎన్నికల్లో ఈ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాల్లో జనసేనకు ఓట్లు ఎక్కువ పడ్డాయి?జనసేన ఓట్లు చీల్చడం వల్ల ఆయా స్థానాల్లో టీడీపీ నష్టపోయింది. ఈ సారి గాని టీడీపీతో పవన్ కట్టు కడితే?వైసీపీ కాపు ఎమ్మెల్యేలకు కష్టాలు తప్పవు. మొత్తానికి సొంతవర్గానికి చెందిన పవన్ తో..కాపు ఎమ్మెల్యేలకు రిస్క్ ఎక్కువే.

## అడ్డంగా బుక్కైన మాధవ్... కఠిన నిర్ణయం తప్పదా

అనంతపురం, ఆగస్టు 6,ఏపీ రాజకీయాల్లో వైసీపీ గోరంట్ల మాధవ్ న్యూడ్ వీడియో కాల్ వ్యవహారం పెద్ద సెన్సెన్షన్ గా మారిన విషయం తెలిసిందే. ఓ మహిళాతో మాధవ్ న్యూడ్ గా మాట్లాడిన వీడియో కాల్ ఒకటి..తాజాగా బయటపడింది..వీడియో వచ్చిన కొద్ది సమయంలోనే సోషల్ మీడియా, మీడియాలో వైరల్ గా మారింది. ఇలా వీడియో వైరల్ కావడంతో..ఎంపీ మాధవ్ మీడియా ముందుకొచ్చి క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు?అది మార్ఫింగ్ చేశారని,ఇదంతా టీడీపీ వాళ్ళ పని అని, టీడీపీ అనుకూల మీడియా పని అని చెప్పి?యథావిధిగా టీడీపీపై ఫైర్ అయ్యారు. అలాగే దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన?నిజనిజాలు తేలుతాయని చెప్పారు.సరే మాధవ్ వీడియో మార్ఫింగ్ చేశారనేది నిజమో కాదో?పోలీసుల విచారణలో తేలుతుంది?కానీ ఈలోపు ఈ వీడియో వల్ల వైసీపీకి డ్యామేజ్ జరిగేలా ఉంది. పైగా ఈ అంశంపై మాధవ్ ఒక్కరే వచ్చి..ఖండించారు తప్ప..ఏ ఒక్క వైసీపీ నేత కూడా మీడియా ముందుకు రావడమో..లేక సోషల్ మీడియా వేదికగా మాధవ్ వీడియోని మార్ఫింగ్ చేశారని ఖండించలేదు. అలాగే వైసీపీ అనుకూల మీడియాలో కూడా మాధవ్ కు అనుకూలంగా కథనాలు రావడం లేదు. అసలు మాధవ్ వ్యవహారంలో సొంత పార్టీ మద్ధతు గాని, సొంత మీడియా మద్ధతు గాని రావడం లేదు.

# పెరుగుతున్న మద్యం ఆదాయం

విజయవాడ, ఆగస్టు 6,కొంతకాలంగా ఏపీలో రాజకీయాలననీ మద్యం చుట్టూ తిరుగుతున్నాయి. ఏపీలో దశలవారీగా మద్యపాన నిషేధం అంటూ అధికారంలోకి వచ్చిన జగన్?ఆ తర్వాత మద్యం ఏరులై పారిస్తున్నారు. ఇదేంటి మీరిచ్చిన హామీ ఏమైందని వైసీపీ నేతలను అడిగితే?అసలు మేనిఫెస్టోలో మద్యపాన నిషేధమే లేదంటూ మంత్రి గుడివాడ అమర్నాథ్ రెడ్డి వంటి వారు బుకాయిస్తున్నారు. ఇక, తాజాగా ఢిల్లీలోని మద్యం టెండర్ల వ్యవహారంల ? వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులు పేరు మార్మోగిపోతోంది. ఆప్ ప్రభుత్వాన్ని మాగుంట ఇరకాటంలో పడేశారని టాక్ వస్తోంది.మద్యం పాలసీ ద్వారా కొన్ని కంపెనీలకు ప్రయోజనం కలిగించారని ఆప్ ప్రభుత్వంపై బీజేపీ విమర్శలు గుప్పిస్తోంది. రూ.144 కోట్ల మేర అక్రమాలకు పాల్పడిందని ఆరోపిస్తోంది. అలా లబ్ధి పొందిన కంపెనీల్లో మాగుంటకు చెందిన కంపెనీలు కూడా ఉన్నాయి. అయితే, ఢిల్లీ మద్యం విధానంలో తమకు లబ్ధి జరిగిందనే ప్రచారంలో వాస్తవం లేదని మాగుంట చెబుతున్నారు. మద్యం విక్రయాల బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకొని ప్రైవేటు సంస్థలకు అప్పగించింది. ఈ విధానం వల్ల గతం కన్నా ఎక్సైజ్ ఆదాయం 27 శాతం పెరిగి రూ. 890 కోట్లకు చేరుకుందని ప్రభుత్వం వెల్లడించింది.ఎంఆర్‌పీ కన్నా తక్కువ ధరలకు మద్యం అందించేలా ప్రభుత్వం ప్రోత్సహించింది. పలు బ్రాండ్లపై ఎంఆర్‌పీ కన్నా తక్కువ ధరకు మద్యం అందుబాటులోకి రావడంతో ఢిల్లీలో అమ్మకాలు పెరిగాయి. దీంతో, ఎక్సైజ్ టెండర్ల కేటాయింపు, డిస్కౌంట్లు అందించే ప్రక్రియలో అవకతవకలు జరిగాయని బీజేపీ ఆరోపిస్తోంది. బ్లాక్ లిస్టులో పెట్టిన కొన్ని కంపెనీలను టెండర్ ప్రక్రియలో అనుమతించారని బీజేపీ నేతలు ఆరోపించారు.బ్లాక్ లిస్టులో



ఉన్న ఖావో గాలి, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డికి చెందిన కంపెనీతో పాటుగా ఇండో స్పిరిట్ కలిసి సిండికేట్ అయ్యి బిడ్లు గెలుచుకున్నారు. చివరకు ఈ వివాదం కారణంగా ఢిల్లీ ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుంది. 9 నెలల తర్వాత తన మద్యం విధానం వెనక్కి తీసుకుంది. మళ్లీ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం అమ్మకాలకు శ్రీకారం చుడతామని చెప్పింది. సెప్టెంబరు 1 నుంచి పాత విధానం అమల్లోకి వస్తుందని చెప్పింది. బీజేపీ నేతలు ఆరోపించే సమయంలో వైసీపీ ఎంపీ మాగుంట పేరుని కూడా ప్రస్తావించడంతో కేజ్రీవాల్ ను మాగుంట ఇరకాటంలో పడేసినట్లయింది.జనసేనాని ప్రశ్నల పర్వంరాజకీయాల్లో అమలు చేయని హామీలని ఇవ్వకూడదు?ఒకవేళ ఇచ్చిన వాటి అమలకు చిత్తశుద్ధితో పనిచేయాలి..కనీసం పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయిన కనీసం?కొంత వరకు అమలు చేయడానికి కృషి చేయాలి?అలా కాకుండా హామీలు విషయంలో మాట తప్పి, మడమ తిప్పితే చాలా ఇబ్బంది. మామూలుగా మాట తప్పడం వల్లే చంద్రబాబు అధికారం కోల్పోయారు. కానీ తాను మాట తప్పను, మడమ తిప్పను అని జగన్ అధికారంలోకి వచ్చారు.మరి అధికారంలోకి వచ్చాక జగన్ మాట తప్పారా? మడమ తిప్పారా? అంటే పలు హామీల విషయంలో జరిగిందనే చెప్పొచ్చు. 2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలని?అధికారంలోకి వచ్చాక పూర్తి స్థాయిలో అమలు చేయడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందనే చెప్పొచ్చు. అయితే మద్యపాన నిషేధం విషయంలో జగన్?పూర్తిగా మాట తప్పారని చెప్పొచ్చు. మద్యపాన నిషేధం అనేది సాధ్యం అవ్వని హామీ?కానీ జగన్?అధికారంలోకి వస్తే అక్కాచెల్లెమ్మలకు కోసం మద్యపాన నిషేధం చేస్తానని అన్నారు.అధికారంలోకి వచ్చాక దశల వారీగా మద్యపాన నిషేధం చేస్తానని చెబుతూ?వైన్ షాపులని తగ్గించడం, ప్రభుత్వమే షాపులని నడపటం, మద్యం ధరలు భారీగా పెంచితే మద్యం తాగేవాళ్లు తగ్గుతారని చెప్పడం లాంటివి చేశారు. ఇక ఎన్ని చెప్పిన ఆదాయం వస్తూనే ఉంది?మద్యం తాగేవాళ్లు తగ్గడం లేదు?పైగా ప్రభుత్వం పిచ్చి పిచ్చి బ్రాండ్లు అమ్ముతుందనే విమర్శలు తెచ్చుకుంది. ఈ విధంగా మద్యపాన నిషేధంలో మడమ తిప్పుతూ వచ్చారు. కొంచెం కొంచెం అయితే పర్లేదు?కానీ తాజాగా మంత్రి గుడివాడ అమర్నాథ్ ఏకంగా?తమ మేనిఫెస్టోలో మద్యపాన నిషేధం హామీని లేదని పూర్తిగా అబద్ధం చెప్పేశారు

## శ్రీవారి ఆలయ భూమి పూజకు రండి

– మహారాష్ట్ర సి ఎం , డిప్యూటీ సి ఎం కు టీటీడీ చైర్మన్ ,ఈవో ఆహ్వానం

తిరుమల ఆగస్టు 06 ముంబై లో టీటీడీ నిర్మించనున్న శ్రీవారి ఆలయ భూమి పూజ కార్యక్రమానికి హాజరు కావాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే , ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ లను టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి , ఈవో ఎ వి ధర్మారెడ్డి ఆహ్వానించారు . ఈ మేరకు శనివారం ఉదయం వీరు ముంబైలో సిఎం , డిప్యూటీ సి ఎం లను కలిశారు . వేద పండితులు షిండే , ఫడ్నవీస్ కు వేద ఆశీర్వచనం చేశారు . చైర్మన్ ,ఈవో శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు . ఆగస్టు 21వ తేదీ భూమి పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు . సి ఎం ,డిప్యూటీ సి ఎం ఇద్దరూ ఈ కార్యక్రమంలో పాల్గొంటామని చెప్పారు . ముంబైలో శ్రీవారి ఆలయ నిర్మాణం కోసం మహారాష్ట్ర ప్రభుత్వం టీటీడీ కి 10 ఎకరాల భూమి అప్పగించింది . రేమండ్స్ కంపెనీ అధినేత గౌతం సింఘానియా ఈ భూమి లో స్వామి వారి ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చిన విషయం తెలిసిందే .

## ఎంపి మాధవ్ దిష్టిబొమ్మ దగ్ధం

విశాఖపట్నం విశాఖలో టిడిపి నేతలను పోలీసులు అరెస్టు చేశారు.సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్న వైసీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.అసభ్యకరంగా ప్రవర్తించిన మాధవ్ తక్షణమే రాజీనామా చేయించి తగిన శిక్ష వెయ్యాలంటూ టిడిపి నాయకులు ఆందోళనకు దిగారు.జాతీయ రహదారిపై ఆందోళకు దిగిన టిడిపి నేతలను పోలీసులు అడ్డుకోవడంతో పోలీసులకి, టీడీపీ నాయకులకి మధ్య తోపులాట చోటు చేసుకుంది.సభ్యసమాజం తలదించుకునేలా వ్యవహరిస్తున్న వైసీపీ నేతలపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అర్హులైన పేదలందరికి సంక్షేమ పథకాలు

కౌతాళం అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు ఇవ్వడమే ముఖ్యమంత్రి ముఖ్య ఉద్దేశ్యం అని మంత్రాలయం నియోజకవర్గం ఎమ్మెల్యే బలనాగిరెడ్డి మరియు ప్రదీప్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కౌతాళం మండలం తొవి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు మంత్రాలయం నియోజీకవర్గ ఎమ్మెల్యే శ్రీ వై బాలనాగిరెడ్డి వైఎస్సార్సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు వై ప్రదీప్ రెడ్డి , తోవి గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి లబ్దిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాల వివరాలను అడిగి తెలుసుకుని ఇంకా ఏమన్నా అర్హత ఉండి లబ్దిపొందలేక పోతున్న సమస్యలు ఏమన్నా ఉంటే మా దృష్టికి తీసుకువచ్చి వెంటనే పరిష్కరించుకోవాలని రాజకీయాలకతీతంగా ప్రజలకు తెలుపుకుంటూ ముందుకు సాగారు,అన్ని వర్గాల ప్రజలు వారికి అందుతున్న పథకాలు జగనన్న ప్రభుత్వం తప్ప ఇంకే ప్రభుత్వం అందివ్వలేదని మాకు ఇన్నేసి పథకాలు అందించిన మీకు మరియు జగన్ ముఖ్యమంత్రి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని చెప్పుకొచ్చారు, తొవి సచివాలయం సందర్శించిన ఎమ్మెల్యే సచివాలయం సిబ్బందితో వారి పనితీరును ప్రజల సమక్షంలో అడిగి తెలుసుకుని ప్రజలకు అందుబాటులో ఉంటూ పథకాల పై అవగాహన కల్పించి ప్రజలను చైతన్య పరచాలని ఆదేశించారు, ఈ కార్యక్రమంలో మండల నాయకులు కృష్ణంరాజు, దేశైకృష్ణ,అత్రిగౌడ, నదిచాగి రామనగౌడ,నాగరాజ గౌడ,మాబు సాబు,ఎంపీపీ అమారేశ, పంచాయతీ డిఈ,హౌసింగ్ డిఈ,తహశీల్దారు,ఎంపిడిఓ, ఎంఈఓ, ఏకాంరెడ్డి, నర్సప్ప, సచివాలయం సిబ్బంది,ప్రజలు వివిధ గ్రామ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమాల నియంత్రణకు టోల్ ఫ్రీ నంబర్ 14500 సేవలు

జిల్లా ఎస్పీ కె.కె.ఎన్ అన్బురాజన్

కడప ఇసుక అక్రమ రవాణా, తదితర అక్రమాల నియంత్రణకు స్పెషల్ ఎన్ఫోర్స్మెంటు విభాగం వారి టోల్ ఫ్రీ నంబర్ 14500 సేవలు వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ కె.కె.ఎన్ అన్బురాజన్ శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఎర్ర చందనం అక్రమ రవాణా, నాటు సారా, అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణా, గుట్కా, మట్కా, పేకాట, గంజాయి, కోడి పందేలు, తదితరాల కట్టడికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు 14500 టోల్ ఫ్రీ నంబరును ప్రారంభించారన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఈ అక్రమాలు జరుగుతుంటే ఈ టోల్ ఫ్రీ నంబర్ కు ఉచిత ఫోన్ కాల్స్ ద్వారా సమాచారం అందించవచ్చన్నారు. ఈ సేవలు వినియోగించుకుని అక్రమాలకు అడ్డుకట్ట వేద్దామని ఎస్పీ కె.కె.ఎన్ అన్బురాజన్ పిలుపునిచ్చారు.

## గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన

నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి

నంద్యాల నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డు ఏకలవ్య నగరంలో శనివారం నాడు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శాసనసభ్యులు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తూ మరోసారి జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని వార్డు ప్రజలను ఎమ్మెల్యే కోరారు.. ఈ సందర్భంగా నంద్యాల శాసనసభ్యులు శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ 23 వ వార్డు లో ప్రతి గడప తిరుగుతూ సంక్షేమ పథకాలతో పాటు వార్డులో ఉన్న సమస్యలను తెలుసుకొని అక్కడే ఉన్న అధికారులతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రభుత్వ పథకలు రావాలంటే లంచం లేనిదే ప్రజలకు అందేవి కావని చంద్రబాబు చేసిన మోసాలను రాష్ట్ర ప్రజలు గుర్తించారని ప్రజలు వైఎస్సార్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు . తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న తప్పుడు ఆరోపణలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని మళ్లీ రాష్ట్రంలో జగనన్నను ముఖ్యమంత్రి ని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మభూన్నిసా, వైస్ చైర్మన్ పాం షావాలి. కౌన్సిలర్ రాజ్యలక్ష్మి. వైసీపీ నేతలు పార్థుడు. మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి. అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్. సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 25 న అంతర్జాతీయ మనవ హక్కుల సంఘం రాష్ట్ర సదస్సు

గుంటూరు ఆగస్టు 6 మానవ హక్కుల పై సెప్టెంబర్ 25 న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు అంతర్జాతీయ మనవ హక్కుల సంఘం ఏపి సివిల్ రైట్స్ చేర్మెన్ కరణం తిరుపతి నాయుడు తెలిపారు. శనివారం ఇక్కడ మీడియా సమావేశం లో మాట్లాడుతూ పలనాడు జిల్లా పిడుగురాళ్ళ లో జరిగే ఈ సదస్సుకు అంతర్జాతీయ మనవ హక్కుల సంఘం సౌత్ ఇండియా చేర్మెన్ ఏవి స్వామి, సౌత్ ఇండియా డ్రగ్స్ చర్మెన్ ఇబ్రహీం పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొంటున్నట్లు తెలిపారు.నేడు రాష్ట్రము లో మానవ హక్కులు మృగ్యమై పోయాయని, వాటిపై సరైన అవగహన లేకపోవడం వళ్ళ ప్రజలు అనేక ఇబ్బందులకు లోనవుతున్నట్లు తెలిపారు. ఈ నేపద్యం లో ప్రజల్లో మానవ హక్కుల పై అవగాహన కలిగించడానికి ఈ సదస్సు ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సదస్సు లో హైకోర్ట్ సీనియర్ అడ్వకేట్ సిహెచ్ .రాజేశ్వర్ రావు పాల్గొంటున్నట్లు తిరుపతి నాయుడు తెలిపారు.ఈ సమావేశం లో అంతర్జాతీయ మనవ హక్కుల సంఘం పల్నాడు జిల్లా చర్మెన్ ఎర్రగుంట్ల సతీస్,ప్రదాన కార్యదర్శి షేక్ బాష,గుంటూరు జిల్లా చేర్మెన్ కే,సత్యం, ప్రదాన కార్యదర్శి కిన్నెర కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## చీకోటి ప్రవీణ్ తో కలిసి జల్సా చేసిన నలుగురు ప్రముఖులకు ఈడీ నోటీసులు



హైదరాబాద్ ఆగష్టు 6 విదేశీ క్యాసినో హవాలా వ్యవహారంలో ఈడీ లోతుగా విచారణ చేస్తున్న వేళ ఈ కేసు తాజాగా మలుపు తిరిగింది.సరదాకు ఆడిన క్యాసినో పేకాట తదితర వ్యసనాలు ఇప్పుడు ఆ ప్రముఖుల మెడకు చుట్టుకుంటున్నాయి. చీకోటి ప్రవీణ్ తో కలిసి జల్సా చేసిన ప్రముఖులకు నోటీసులు అందుతుండడం వారిని కలవరపెడుతోంది. చీకోటి ప్రవీణ్ వ్యవహారంలో పలువురు రాజకీయ నేతలతో జరిపిన వాట్సాప్ చాటింగ్ కలకలం రేపుతోంది. నేపాల్ శ్రీలంక థ్యాయ్ లాండ్ మలేషియా తదితర దేశాల్లో క్యాసినోల నిర్వహణలో ఆరితేరిన చీకోటి ప్రవీణ్ పలువురు ఎమ్మెల్యేల వాట్సాప్ సంభాషణలను ఈడీ గుర్తించినట్టు సమాచారం. ఈ క్రమంలోనే ప్రవీణ్ మాధవరెడ్డి సెల్ ఫోన్లను ఫోరెన్సిక్ ల్యాబ్ లో శాస్త్రీయంగా విశ్లేషించడం ద్వారా తొలగించిన సంభాషణలేమైనా ఉంటే రికవరీ చేసేందుకు ఈడీ ప్రయత్నిస్తోంది.చీకోటి ప్రవీణ్ కేసులో ప్రవీణ్ తోపాటు మరో ఏజెంట్ దాసరి మాధవరెడ్డి ఇంట్లో సోదాలు చేసిన ఈడీ బృందాలు పలు సాంకేతిక ఆధారాలను స్వాధీనం చేసుకున్నాయి. సెల్ ఫోన్లతోపాటు ల్యాప్ ట్యాప్ లను జప్తు చేసి వాటిని విశ్లేషించడంలో నిమగ్నమయ్యాయి. సంభాషణల్లో పలువురు సినీ రాజకీయ ప్రముఖుల వాట్సాప్ చాటింగ్ లు ఉంటాయని ముందు నుంచే ప్రచారం జరిగింది.ఈ క్రమంలోనే ప్రవీణ్ ఫోన్ లో తెలంగాణకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఆంధ్రప్రదేశ్ కు చెందిన మాజీ ఎమ్మెల్యేతో సాగించిన వాట్సాప్ సంభాషణలను ఈడీ గుర్తించినట్టు తెలిసింది. వీటిపై లోతుగా విశ్లేషిస్తున్నారు. వీరితో ప్రవీణ్ ఆర్థికలావాదేవీలు.. మనీలాండరింగ్ పై తేల్చేపనిలో ఈడీ నిమగ్నమైంది.ప్రస్తుతం ఆర్థిక లావాదేవీలు వాట్సాప్ చాటింగ్ ను రీట్రైవ్ చేసే పనిలో ఉన్నారు. ఫోరెన్సిక్ ల్యాబ్ లో శాస్త్రీయంగా విశ్లేషించడం ద్వారా తొలగించిన సంభాషణలేమైనా ఉంటే రికవరీ చేసేందుకు ఈడీ ప్రయత్నిస్తోంది.ఇక ఈ కేసులో తాజాగా చీకోటి ప్రవీణ్ స్టేట్ మెంట్ ఆధారంగా నలుగురు ప్రజాప్రతినిధులకు ఈడీ నోటీసులు జారీ చేసింది. ఇందులో ముగ్గురు తెలంగాణ ఎమ్మెల్యేలు ఒక ఏపీ మాజీ ఎమ్మెల్యేకు ఈడీ నోటీసులు జారీ చేసింది. రేపటి నుంచి విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది.తెలుగురాష్ట్రాల్లో సంచలనమైన 'క్యాసినో' కేసులో ఇతడే ప్రధాన ముద్దాయి. చీకోటి ప్రవీణ్ తోపాటు మరో ముగ్గురు లావాదేవీలు బ్యాంకు అకౌంట్లను పరిశీలించిన ఈడీ మొత్తంగా రూ.25 కోట్ల లావాదేవీలను గుర్తించినట్లు తెలుస్తోంది. ఆ నగదు అంతా ఎక్కడి నుంచి వచ్చింది? ఎలా వచ్చింది? ఎలా మార్పిడి చేశారు? వంటి అంశాలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది.. తాజాగానలుగురికి నోటీసులు జారీ చేసింది. కేసినోలకు అలవాటు పడిన ప్రముఖులు రాజకీయ నేతలు సంపన్నులు చీకోటి ప్రవీణ్ ద్వారా గోవా నేపాల్ బ్యాంక్ కేసినోలకు వెళ్లేవారు. వారు ఇక్కడ నగదు రూపంలో లక్షలు చీకోటి ప్రవీణ్ అతడి ఏజెంట్లకు చెల్లిస్తే .. వారు ఏ దేశానికి వెళతారో? ఆ దేశం కరెన్సీని కమిషన్ మినహాయించుకొని సమకూరుస్తారు.ఇలా కరెన్సీ కంటే ఎక్కువగా వారు కేసినోలో ఆడే కాయిన్స్ ఇస్తారని చెబుతున్నారు. తర్వాత అక్కడ ఓడిపోతే ఇక్కడ తీసుకునే సమస్య ఉండదు.ఇక కేసినోల్లో విదేశాల్లో గెలుచుకుంటే వాటిని వైట్ మనీగా ఇండియాకు చేర్చే బాధ్యత కూడా చీకోటి ప్రవీణ్ తీసుకుంటారని చెబుతున్నారు. దానికీ కమిషన్ పొందుతాడని అంటున్నారు. ఈ కేసును ఛేదించిన ఈడీ ప్రస్తుతం విచారణ జరుపుతోంది.

## బిడ్డకు తల్లి పాలు శ్రేయస్కరం

ఎంపీపీ రాచకొండ లక్ష్మి రవి

కమాన్ పూర్ బిడ్డకు తల్లిపాలు తప్పనిసరి అని, శ్రేయస్కరమని కమాన్ పూర్ ఎంపీపీ రాచకొండ లక్ష్మి రవి సర్పంచ్ ఆకుల ఓదెలు అన్నారు. కమాన్ పూర్ మండలం గుండారం గ్రామంలో అంగన్వాడీ సెంటర్ లో తల్లిపాల వారోత్సవాలు-2022 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ఈ నెల ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు ఈ వారోత్సవాలను ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు తల్లిపాలనే వాడాలని, అందుకుగాను అంగన్వాడి కేంద్రాల్లో పోషక విలువలతో కూడిన ఆహారం ఇస్తున్నామని తెలిపారు. బిడ్డ పుట్టిన గంట తర్వాత తల్లి పాలు పట్టించలన్నారు.దీనివల్ల బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందనీ తెలిపారు. ఈ సందర్భంగా బాలింతలకు, గర్భిణీలకు,పిల్లతల్లులకు పౌష్టికాహారం విలువలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ లు విజయలక్ష్మి శివనాగాంజలి ఏఎన్ఎం ఇందిరా తదితరులు పాలుగొన్నారు.

## తహసిల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత..!

బండి ఆత్మకూరు ఆగస్టు 6 నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం బండి ఆత్మకూరు మండల తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నార నీ ప్రజలు అనుకుంటున్నారు.కార్యాలయంలో గత వారం రోజులుగా అర్ ఐ 1 సెలవు,అర్ ఐ 2 డి ఫైటేసన్ పై నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారని సమాచారం .జూనియర్ సీనియర్ అసిసటెంట్లు ఒ టైపిస్ట్ తదితరులు తహసిల్దార్ కార్యాలయం లో కొరతగా ఉంది... రోజు శనివారం 12 గం.లు కావస్తున్నా..ఇంకా విధులకు హాజరు కాని తహసిల్దార్..అయినప్పటికీ ప్రజలు వారి అవసరాలకోసం ఎదురు చూస్తున్నారు తప్పా ప్రశ్నించడం లేదు...ప్రస్తుతం బండి ఆత్మకూరు తహశీల్దారు కార్యాలయం పరిస్తితి ఇది.. సంధించిన పై అధికారులు స్పందించి ఇప్పటికైనా చర్యలు తీసుకొని ప్రజలకు తహసిల్దార్ కార్యాలయం నందు సిబ్బంది కొరత మరియు తహసిల్దార్ కార్యాలయం నకు సకాలంలో హాజర్ అయ్యేట్టు చర్యలు తీసుకోవాలని బాధిత మండల పరిధిలోని రెవెన్యూ సమస్యలు ఉన్న ప్రజలు కోరుతన్నారు.

## ముక్కంటి దర్శించుకున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్

కాళహస్తి శ్రీ కాళహస్తీశ్వర స్వామి వారి దర్శనానికి శ్రీహరికోట ఇస్రో చైర్మన్ ఎస్. సోమనాథ్ శనివారం వచ్చారు. అయనకు ఆలయ కార్యనిర్వాహణాధికారి సాగర్ బాబు దక్షిణ గాలి గోపురం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు కల్పించారు. అనంతరం శ్రీ స్వామి అమ్మవార్ల గర్భాలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వేద పండితుల ఆశీర్వచనం ఇప్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ఎల్వి-డి1 కి సంబంధించి ఉపగ్రహ నమూనాను దేవదేవుడు,శ్రీకాళహస్తీశ్వరుని ఆశీస్సులు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంలకు మొదటి లాంచింగ్ చేయడం జరుగుతుందని శ్రీకాళహస్తీశ్వరుని, ఆదేవదేవుని ఆశీస్సులు తో విజయం సాధించాలని కోరుకుంటున్నామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి సాగర్ బాబు ఆలయ డిప్యూటీవో కృష్ణారెడ్డి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున్, ప్రసాద్ ఆలయ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజలలో ఉద్యమ చైతన్యాన్ని రగిలించిన వ్యక్తి ఆచార్య జయశంకర్ సార్

-మంథని మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ

మంథని తెలంగాణలోని నాలుగు కోట్ల ప్రజలలో ఉద్యమ చైతన్యాన్ని రగిలించిన వ్యక్తి ఆచార్య జయశంకర్ సార్ అని మంథని మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ అన్నారు. శనివారం మంథని పట్టణంలోని వారి నివాసం రాజాగృహ లో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి టిఆర్ఎస్ నాయకుల తో కలిసి ఆమె పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్తగా, తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయ శంకర్ సార్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంథని ఎంపీపీ కొండ శంకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ అరేపల్లి కుమార్, రైతుబంధు అధ్యక్షులు ఆకుల కిరణ్, టిఆర్ఎస్ నాయకులు యెగోళపు శంకర్ గౌడ్, తగరం శంకర్ లాల్, బత్తుల సత్యనారాయణ, రామడుగు మారుతి, నక్క శంకర్, పాపారావు, మంథని లక్ష్మణ్, వేల్పుల గట్టయ్య, రాజమౌళి గౌడ్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు

## పీజీ పరీక్షలుపరీక్ష కేంద్రాన్ని తనిఖీ

కడప యోగి వేమన విశ్వవిద్యాల యం పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య కె. కృష్ణారెడ్డి ఏపీజే అబ్దుల్ కలాం కేంద్ర గ్రంథాలయం ఆవరణలోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును సూపరింటెండెంట్లను అడిగి తెలుసుకున్నారు. 509 మంది విద్యార్థులకు గాను 500 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. కళాశాల ఉప ప్రధానాచార్యులు, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ఆచార్య టి. శ్రీనివాస్, అదనపు పరీక్షల పర్యవేక్షకులు డా.లక్ష్మి ప్రసాద్, పరీక్షలను పర్యవేక్షించారు. సిబ్బంది చంద్రమౌళి పాల్గొన్నారు

## శిల్పా నగరంలో ఎట్టకేలకు పరిశుభ్రతా చర్యలు

నంద్యాల శిల్పా నగరంలో ప్రధాన ద్వారం వద్ద అపరి శుభ్రం తాండవిస్తోందని, కాలనీ వాసులు అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ కు ఫిర్యాదు చేశారు . ఆయన వెంటనే పారిశుధ్య కార్మికులను పంపి పూడిక పనులు చేపట్టాలని సూచించారు . డ్రైనేజీ వ్యవస్థ సరిచేయాలని ఆదేశించారు. దీంతో సిబ్బంది పూడికతీత పనులు చేపట్టారు. అలాగే వాడుకనీరు బయటకు డ్రైనేజీ లోకి వెళ్లేందుకు చర్యలు చేపట్టారు.

## జనన మరణ ధ్రువపత్రాల జారిలో అవినీతి

నంద్యాల నంద్యాల మున్సిపల్ ఆఫీసు యందు జనన, మరణ ధ్రువపత్రాల జారీలో కొందరు అక్రమార్కులు, మధ్యవర్తులు తమ దందా సాగిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంతంలో తిష్ట వేసి పత్రాల కోసం వచ్చేవారిని గుర్తించి బోల్తా కొట్టిస్తున్నారు. మాయ మాటలతో వారిని మబ్య పెడుతూ అందినంత దండుకుంటున్నారు .వివరాలు తప్పుగా నమోదైతే.తల్లిదండ్రుల పేర్లు, చిరునామా, మరణించిన వారి కుటుంబ సభ్యుని పేర్లు నమోదులో జరిగే పొరపాట్లు, తప్పొప్పులు, అక్షరదోషాలను సరిచేసుకునే వీలుంది. అది కారులు అందుకోసం సూచించిన అఫిడవిట్ను మీసేవా కేంద్రం ద్వారా దాఖలు చేస్తే, వాస్తవిక పత్రాలతో సరి పోల్చి సరైన ధ్రువపత్రాలను తిరిగి జారీచేసే అవకాశం ఉంటుంది. ఇక ఇంటి వద్ద(గతంలో జరిగిన ప్రసవాల కారణంగా జన్మించిన వారి వివరాలు మున్సిపల్ ఆఫీసు రికార్డుల్లో నమోదు కాకపోతే, మునిసిపల్ ఆఫీసు నుంచి నాన్ ఎవై లబిలిటీ సర్టిఫికెట్ పొందాలి. ఆపై తగిన వివరాలు, ఆఫ్ డవిట్ సాయంతో తహశీల్దారు కార్యాలయంలో దాఖలు చేయాలి. రెవెన్యూ అధికారి క్షేత్రస్థాయిలో వాస్తవిక పరి శీలన చేసి, ఆయా వివరాలను సబ్ కలెక్టర్ కు పంపుతారు.వాటి ఆధారంగా జనన, మరణాల ధ్రువీకరణకు వీలుగా సంబంధిత రిజిస్టర్కు సబ్ కలెక్టర్ అనుమతిస్తారు. అందుకు కొంత సమయం పడుతుంది. పత్రాల జారీలో నెలకొంటున్న అడ్డంకులు, ఆటం కాలు, జాప్యం, కుటుంబ సభ్యుల అవగాహనలేమి వంటి అంశాల ఆసరాగా చేసుకుని కొందరు మధ్యవ ర్తులు, అక్రమార్కులు, మీసేవా, పురసేవా, సిబ్బంది అడ్డగోలుగా దోచుకుంటున్నారు.

## కర్నూలు అర్బన్ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తా,కర్నూల్ అర్బన్ తాసిల్దార్ ఐ విజయ శ్రీ,



కర్నూలుకర్నూల్ అర్బన్ తాసిల్దార్ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని నేడు ఒక ప్రకటన లో తెలిపారు నేడు కర్నూల్ అర్బన్ తాసిల్దార్ గా బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమెకి పలువురు సిబ్బంది మరియు ప్రజలు అభినందనలు తెలిపారు. అనంతరం పుష్పగుచ్చం అందజేసి. కేక్ కట్ చేశారు, తాసిల్దార్ గా బాధ్యతలు నిర్వహించి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ కర్నూల్ అర్బన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎల్లప్పుడూ మెరుగైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు.

## ఆజాదిక అమ్రిత్ మహోత్సవ్ "హర్ ఘర్ తిరంగ" ద్వార దేశభక్తి ని చాటుదాం.

కర్నూలు' ఆగస్టు 6, స్థానిక ఉస్మానియా కళాశాలలో ఈ రోజు ఆజాదిక అమ్రిత్ మహోత్సవ్ "హర్ ఘర్ తిరంగ" కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కరస్పాండెంట్ శ్రీ మతి అజ్రా జావీద్ మరియు ప్రిన్సిపాల్ సయ్యద్ సమిఉద్దిన్ ముజమ్మిల్ జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ కళాశాల నుంచి ప్రారంభమై కిడ్స్ వరల్డ్ మీదుగా కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐదు వందల మంది విద్యార్థులు మరియు ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ పి ఓ ఎస్ ఉబెదుల్ల షరీఫ్ యూనిట్ పి ఓ ఆబిద్ అలీ మరియు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.




## మరో ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో

నెల్లూరు ఆదివారం ఉదయం 9.18 గంటలకు శ్రీహరికోట నుంచి ఎస్ఎస్ఎల్వీ – డీ1 రాకెట్ ప్రయోగం జరగనుంది. రాకెట్ ద్వారా ఈఓఎస్ -02, ఆజాదీశాట్ అనే ఉపగ్రహాలను ఇస్రో నింగిలోకి పంపనుంది. భూపరిశోధనల కోసం 137 కేజీల బరువైన ఈఓఎస్ 02 ఉపగ్రహం ఉపయోగపడనుంది. భారత గ్రామీణ ప్రాంత విద్యార్థినిలు 8 కేజీల బరువైన ఆజాదీశాట్ ఉపగ్రహన్ని రూపొందించారు. కొత్త వాహకనౌక ద్వారా శాస్త్రవేత్తలు తమ ప్రయోగాన్ని చేపట్టనున్నారు. ఇప్పటి వరకు పిఎస్ఎల్వీ రాకెట్ ల ద్వారా వందలాది ఉపగ్రహాలను ఇస్రో నింగిలోకి పంపింది. – మొదట సౌండింగ్ రాకెట్, ఎస్ఎల్వీ, ఏఎస్ఎల్వీలను రూపొందించిన ఇస్రో, అ తర్వాత పిఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ రాకెట్ ల ద్వారా ప్రయోగాలు చేసింది.

# బంగారుపేట ఆటో స్టాండ్ పునరుద్ధించాలి

### ఆటో యూనియన్ సిఐటియు



కర్నూలు ఆగస్టు 6 బంగారు పేట ఆటో స్టాండ్ పునరుద్ధంచాలని రామద్దయ్య అధ్యక్షతన బంగారుపేట ఆటో స్టాండ్ లో నిరసన కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి ×పి మహమూదు గారు డి కుమార్ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో పీ మహమూద్ కుమార్ ఆటో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ మన స్టాండ్ మనం కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు గత 30 సంవత్సరాల పైనుంచి ఆటో స్టాండ్ ను ఏర్పాటు చేసుకొని మా కుటుంబాలను పోషించుకుంటే రోడ్డు వెడల్పు పేరుతో మున్సిపల్ అధికారులు ట్రాఫిక్ నిబంధన పేరుతో ట్రాఫిక్ పోలీస్ అధికారులు ఆటో స్టాండ్ తీసివేయడం సిగ్గుచేటని అన్నారు మా స్టాండ్ ను పునరుద్ధించాలని పునరుద్ధించని పక్షంలో పోరాటాలకు వెనుకాడమని అన్నారు ఈ స్టాండ్ విషయంలో ట్రాఫిక్ డిఎస్పి గారిని కలవడానికి వెళితే ఆటో కార్మికులు ఏదో ద్రోహం చేశారు అనే విధంగా డిఎస్పి గారు వ్యవహరిస్తున్నారు డిఎస్పీ గారికి మేము ఒకటే చెప్తా ఉన్నాం మా స్టాండ్ ను మాకు ఏర్పాటుచేసి మా జీవితాలని కాపాడాలని కోరుకుంటున్నాము మున్సిపల్ అధికారులు కూడా 15 సంవత్సరాల క్రితమే అక్కడ ఆటో స్టాండ్ అని బోర్డు ఏర్పాటు చేశారు 15 ఆటోలకు మాత్రమే అనుమతి అని ఏర్పాటు చేయడం జరిగింది రోడ్డుని ఎంతోమంది ఆక్రమించుకొని బిల్డింగులు కడతా ఉంటే మున్సిపల్ అధికారులు ఏమి చేయలేక మా ఆటో స్టాండ్ ని తీసివేయడం ఎంతవరకు సబబు అని అన్నారు అక్కడ ఆటో స్టాండ్ తీసివేయడం వల్ల 20 ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి అన్నారు తక్షణమే ఆటో స్టాండ్ ఏర్పాటు చేసి ఆటో కార్మికుల ను ఆదుకోవాలి అన్నారు ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు సహాయ కార్యదర్శి కే వెంకటేశ్వర్లు సుధాకర్ మధు ఎల్లప్ప ఆటో కార్మికులు 25 మంది పాల్గొన్నారు అభినందనలతో పీ మహమూద్ ప్రధాన కార్యదర్శి ఆటో యూనియన్ సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ కర్నూలు

# తల్లిపాలే పిల్లలకు జీవనాధారం.

### ఇందిరాగాంధీ నగర్ లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు,



కర్నూలు ఆగస్టు 6, ఘనంగా కర్నూల్ నగరం లోని 1, 2, 3 సెంటర్లలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు. జూన్ 1, నుండి ఆగస్టు, 7 వరకు తల్లిపాల వారోత్సవాలు. నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియాలోనిఎ.అ.ఆ. ూ. సూపర్ వైజర్ ఐ. మాణిక్యమ్మ అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ ూ. ఆర్ఫాన్ . హాజరయ్యారు. అనంతరంఏరియాలోని గర్భవతులు, బాలింతలకు మరియు తల్లులను సమావేశం చేసి వారికి తల్లిపాల యొక్క విశిష్టత గురించి అవగాహన మరియు గర్భవతులు, బాలింతలకు ఇప్పుడు ఇంటికి ఆహార పదార్థాలు ఇస్తున్నారని, అంగన్వాడి . సెంటర్లలోనే తెలపడం జరిగిందన్నరు.. బాలింతలు భోజనం, ఆహారము భుజించాలని వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచరు శకుంతల రాధిక తదితరులు పాల్గొన్నారు.

# పంటల బీమా ఇన్సూరెన్స్ డబ్బులను తక్షణమే రైతుల ఖాతాలలో జమ చేయాలి-సిపిఐ




ఎమ్మిగనూరు-రైతుల పంటల బీమా ఇన్సూరెన్స్ డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్న గౌడ్ తెలిపారు.అనంతరం నందవరం లోని విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటాలకు ఎక్కువ, చేతలకు తక్కువ అన్న విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఉదాహరణ రైతుల పంటలకు బీమా ఇన్సూరెన్స్ డబ్బులను ఖాతాలకు జమ చేస్తామని పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుని కేవలం సగం మంది రైతుల ఖాతాలకు మాత్రమే జమ చేసి మిగతా వాళ్లకు జమ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేయడం జరిగిందని సందర్భంగా వారు తెలిపారు.వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఎక్కడ కూడా అభివృద్ధి చేయకుండా ప్రజలను మసిపూసి మారడుకాయ్ చేసే పద్ధతిలో పరిపాలిస్తుందని, నేడు ప్రభుత్వం గడపగడప వైఎస్ఆర్ ప్రభుత్వం అంటూ వారు చేసిన అభివృద్ధి గురించి తెలియడానికి గ్రామాలకు వస్తున్నారని, గ్రామాల ప్రజలే నిలదీయాలని వారు ప్రజలకు పిలుపునివ్వడం జరిగింది. కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే ఇన్సూరెన్స్ డబ్బులను రైతుల ఖాతాలకు జమ చేయకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, మండల సహాయ కార్యదర్శి విజేంద్ర, మిన్నల్లా, దస్తగిరి,రవి , తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేసిన:- మనీ మదీనా మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు నాగమణి,



కర్నూలు ఆగస్టు 6, కర్నూల్ నగరం ప్రకాష్ నగర్ లోని మణి మదీనా మహిళ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో. శాంతి ఆశ్రమ ట్రస్ట్ వ్యవస్థాపకులు పూజ్యశ్రీ హిమాలయ బాబా గారి సహకారంతో 48 వ, వార్డులోని – మున్సిపల్ హైస్కూల్ 10 వ, తరగతి విద్యార్థులకు మణి మదీన మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు నాగమణి చేతుల మీదుగా నోట్ బుక్స్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కారిక్రమంలో అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ 10 వ తరగతి విద్యార్థులు. బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత పొందాలని చదువు చెప్పిన గుణవులకు మరియు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు ఆమె తెలియజేశారు. ప్రధాన ఉపాధ్యాయుడు. విజయ కుమార్ మాట్లాడుతూ.మణి మదీన మహిళా సంక్షేమ సంఘం వారు చేస్తున్న సామజిక సేవా కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తి దాయకంగా ఉన్నాయని ఆయన అన్నారు. శనివారం మా టంగుటూరి ప్రకాశం పంతులు స్కూల్లో నోట్ బుక్స్ పంపిణీ చేయాడం చాలా సంతోషించ దగ్గ విషయమని తెలిపారు. ఈ కారక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మరియు మనీ మదీనా మహిళా సంఘం కార్యవర్గ సభ్యులు, శాంతి, హసేన, కవిత, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల ఆవరణలో మందుబాబుల ఆగడాలను అరికట్టాలి.ఎస్ఎఫ్ఐ

ఎమ్మిగనూరు పట్టణంలో రోజురోజుకు మందుబాబుల ఆగడాలు పెరిగిపోతున్నాయని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు అజిత్ కుమార్ మరియు కార్యదర్శి రంగప్ప అన్నారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న నలంద డిగ్రీ కళాశాల గ్రౌండ్లో మరియు జూనియర్ కళాశాల గ్రౌండ్ రివర్స్ కాలనీ గ్రౌండ్ మరియు కొన్ని విద్యాసంస్థల ఆవరణలో ముఖ్యంగా సాయంకాల మరియు రాత్రివేళ మందుబాబులు మద్యం తాగి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తూ మందు సీసాలను గ్రౌండ్లో పడేస్తూ విద్యార్థులను ఇబ్బంది గురి చేస్తున్నారు. అలాగే కొంతమంది అపరిచిత వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.కాబట్టి విద్యా అధికారులు మరియు పోలీసు సిబ్బంది రాత్రివేళ విద్యాసంస్థల చుట్టుపక్కల కానిస్టేబుల్లతో గస్తీ ఏర్పాటు చేయవలసిందిగా కోరుచున్నాము సరస్వతీ నిలయాలకు కారణమైన విద్యాసంస్థల ఆవరణంలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగడం బాధాకరం ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి అపరిచిత వ్యక్తులను మందుబాబులను వారి యొక్క ఆగడాలను అరికట్టాలని ఎస్ఎఫ్ఐగా డిమాండ్ చేస్తున్నాం. లేనిపక్షంలో ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో హుసేని,రాము, సైఫుల్ల తదితరులు పాల్గొన్నారు.

# రూ. 8.5 వేల కోట్లు రాబట్టిన సినిమాకు సీక్వెల్..!




కేవలం 50 మిలియన్ డాలర్లతో రూపొందిన హాలీవుడ్ మూవీ 'జోకర్' సినిమా 2019 అక్టోబర్ లో ప్రపంచ వ్యాప్తంగా విడుదల అయ్యి ఏకంగా 1.074 బిలియన్ లు అంటే ఇండియన్ రూపీస్ లో రూ.8.5 వేల కోట్లు వసూళ్లు గా రాబట్టింది.జోకర్ సినిమా భాషతో సంబంధం లేకుండా ప్రతి ఒక్క దేశంలో కూడా సూపర్ హిట్ అయ్యి.. వరల్డ్ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ జాబితాలో నిలిచింది.జోకర్ సినిమా లో నటించిన జోక్విన్ ఫీనిక్స్ ఆస్కార్ అవార్డు ను దక్కించుకున్న విషయం తెల్సిందే. అంతే కాకుండా మొత్తం 11 కేటగిరీల్లో జోకర్ సినిమా ఆస్కార్ నామినేషన్ ను దక్కించుకుంది. అవార్డులు రివార్డులు అందుకోవడంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా కమర్షియల్ గా ది బిగ్గెస్ట్ మూవీగా నిలిచిన జోకర్ సినిమా కు సీక్వెల్ రాబోతున్నట్లుగా అధికారికంగా ప్రకటన వచ్చింది.జోకర్ సినిమా వచ్చినప్పటి నుండే సీక్వెల్ గురించిన ప్రచారం జరుగుతోంది. కాని యూనిట్ సభ్యులు మాత్రం జోకర్ 2 గురించి ఎలాంటి అధికారిక ప్రకటన ఇప్పటివరకు ఇవ్వలేదు. కాని తాజాగా మాత్రం జోకర్ 2 ను అధికారికంగా ప్రకటించారు. జోకర్ 2 యొక్క విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.జోకర్ మొదటి పార్ట్ ను 2019 అక్టోబర్ 4న విడుదల చేయడం జరిగింది. జోకర్ 2 ను సరిగ్గా అదే తేదీన అయిదు సంవత్సరాల తర్వాత అంటే 2024 అక్టోబర్ 4వ తారీకు ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నారుఇప్పటికే షూటింగ్ కార్యక్రమాలను జోకర్ 2 జరుపుకుంటుందనే వార్తలు వస్తున్నాయి. టాడ్ ఫిలిప్స్ దర్శకత్వంలోనే సీక్వెల్ కూడా రూపొందుతున్నట్లుగా తెలుస్తోంది.

# షాలిని ఫూల్ సైడ్ ట్రీట్ అగ్గి రాజేస్తోందిగా..!



షాలిని పాండే పరిచయం అవసరం లేదు. అర్జున్ రెడ్డి గాళ్ గా పాపులరైన ఈ బ్యూటీ మహానటి చిత్రంలోనూ క్యూట్ అండ్ లవ్ లీ రోల్ లో గొప్ప నటనతో కట్టి పడేసింది. సింపుల్ క్యాచీ లుక్స్ తో పక్కింటి అమ్మాయిలా కనిపించే షాలినికి అన్నిచోట్లా చక్కని ఫాలోయింగ్ ఉంది.ఇక బాలీవుడ్ బిగ్ డ్రీమ్స్ తో ఈ బ్యూటీ చేసిన ప్రయోగాల గురించి తెలిసిందే. హిందీ అగ్ర హీరో రణవీర్ సింగ్ సరసన జయేష్ భాయ్ జోర్ధార్ లో నటించింది. కానీ ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయం సాధించలేదు.ప్రస్తుతం హిందీ చిత్రం 'మహారాజా'లో నటిస్తోంది. ఈ సినిమాపై చాలా హోప్స్ పెట్టుకుంది. తిరిగి సౌత్ లో తన కమ్యూనికేషన్ ని మరింత ధృఢం చేస్తోందని సమాచారం. దక్షిణాదినా పలు చిత్రాలకు కమిటైంది.. కానీ వాటి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.మరోవైపు షాలిని ఇన్ స్టా మాధ్యమంగా వరుస ఫోటోషూట్లతో దుమారం రేపుతోంది. ఇటీవల మాల్దీవుల వెకేషన్ నుంచి వరుస బికినీ ఫోటోలతో మతులు చెడగొట్టింది.కొంత స్లిమ్ లుక్ కి మారాక ఈ నవనాయిక మరింతగా చెలరేగిపోతోంది. తాజాగా షాలిని ఫూల్ సైడ్ ట్రీట్ వెబ్ లో దుమారం రేపుతోంది. బ్లూ బికినీలో .. గ్రీన్ టాప్ లో రకరకాల భంగిమలతో షాలిని మతులు చెడగొడుతోంది. ప్రస్తుతం ఈ ఫోటోలు వెబ్ లో వైరల్ గా మారాయి. షాలిని క్యూట్ అండ్ హాట్ అంటూ అభిమానులు వీటికి కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు.

# ఆట ఏదైనా ఒక్కటే.. అంపైర్ల చీటింగ్ మాత్రం మారదు




కామన్‌వెల్త్ గేమ్స్‌లో భారత మహిళల హాకీ జట్టు శుక్రవారం ఆస్ట్రేలియా మహిళలతో జరిగిన సెమీఫైనల్లో ఓటమి పాలైన సంగతి తెలిసిందే. పెనాల్టీ షూటౌట్‌లో భాగంగా ఆసీస్ చేతిలో భారత్ 3-0తో పరాజయం చవిచూసింది. అయితే పెనాల్టీ షూటౌట్ ప్రారంభానికి జరిగిన ఒక చిన్న తప్పిదం భారత మహిళలను ఓటమి వైపు నడిపించింది. విషయంలోకి వెళితే.. మ్యాచ్ ముగిసే సమయానికి ఇరుజట్లు 1-1తో సమంగా నిలిచాయి. దీంతో పెనాల్టీ షూటౌట్ అనివార్యమైంది.ఆస్ట్రేలియా డిపెండర్ అంబ్రోషియా మలోనే షూటౌట్‌కు సిద్ధమైంది. ఆమె షాట్ ఆడగా.. భారత గోల్‌కీపర్ సవితా అడ్డుకుంది. అలా ఆసీస్ ఒక పెనాల్టీ వృథా చేసుకుందని మనం సంతోషించేలోపే అంపైర్ మధ్యలో దూరింది. సారీ.. షూటౌట్ క్లాక్ టైంలో తప్పిదం ఉందని.. మళ్లీ ప్రారంభించాలని చెప్పింది. అప్పటికే షూటౌట్ చేయడానికి వచ్చిన భారత క్రీడాకారిణికి విషయం చెప్పి అక్కడి నుంచి పంపించేసి మళ్లీ అంబ్రోషియాను పిలిచింది. తొలిసారి మిస్ అయిన అంబ్రోషియా ఈసారి మాత్రం గురి తప్పలేదు. ఆ తర్వాత ఆస్ట్రేలియా వరుసగా మూడు గోల్స్ కొట్టగా.. భారత్ మాత్రం?ఒక్క గోల్ చేయలేకపోయింది. అలా భారత మహిళల హాకీ జట్టు ఫైనల్ చేరడంలో విఫలమైంది.అయితే పెనాల్టీ షూటౌట్ సమయంలో అంపైర్ విధానంపై అన్ని వైపుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆడుతున్నది ఒక సెమీఫైనల్ మ్యాచ్ అని మరిచిపోయి.. క్లాక్‌టైం మిస్టేక్ అని చెప్పడం సిల్లీగా ఉందని.. అంపైర్ కావాలనే ఇలా చేసిందేమో అంటూ కామెంట్స్ చేశారు. ఇదే విషయమే టీమిండియా మాజీ ఆటగాడు వీరేంద్ర సెహ్వాగ్ కూడా అంపైర్ తీరుపై ఘాటుగా స్పందించాడు."ఆస్ట్రేలియాకు పెనాల్టీ మిస్ కాగానే అంపైర్ పరిగెత్తుకొచ్చి.. సారీ క్లాక్ ఇంకా స్టార్ట్ చెయ్యలేదు.. మళ్లీ ఆరంభిద్దామా అని సింపుల్‌గా చెప్పేసింది. అంపైర్లు ఇలా ఎందుకుంటారో అర్థం కావడం లేదు. క్రికెట్.. హాకీ ఇలా ఏదైనా ఒక్కటే.. అంపైర్లు తమకుండే సూపర్ పవర్‌తో ఎలాంటి నిర్ణయమైనా తీసుకుంటారు. ఇలాంటివి క్రికెట్‌లో బాగా జరిగేవి.. అందుకే మేం హాకీలోకి కూడా త్వరలోనే ఎంటరవుతాం.. అమ్మాయిలు.. ఓడిపోయారు పర్లేదు.. మిమ్మల్ని చూస్తే గర్వంగా ఉంది." అంటూ క్యాప్షన్ జత చేశాడు.మరోవైపు భారత్-ఆస్ట్రేలియా వుమెన్స్ మధ్య జరిగిన సెమీస్ మ్యాచ్‌పై విమర్శలు పెరగడంతో అంతర్జాతీయ హాకీ ఫెడరేషన్ కూడా స్పందించింది. "కామన్‌వెల్త్ గేమ్స్‌లో భారత్- ఆస్ట్రేలియా సెమీఫైనల్లో షూటౌట్ చిన్న తప్పిదం వల్ల క్లాక్ సెట్ చేయకముందే ప్రారంభమయింది. అందుకే మళ్లీ ప్రారంభించాం. ఈ తప్పిదానికి మేం క్షమించమని కోరుతున్నాం. ఇలాంటివి జరగకుండా జాగ్రత్తపడతాం." అని కామెంట్ చేసింది.కాగా సెమీస్‌లో ఓడినప్పటికి భారత మహిళల హాకీ జట్టుకు కాంస్య పతక పోరుకు సిద్ధమవనుంది. మరో సెమీఫైనల్లో ఇంగ్లండ్ న్యూజిలాండ్‌పై 2-0 తేడాతో విజయం సాధించి ఫైనల్ పోరుకు అర్హత సాధించింది. ఇక కాంస్య పతక పోరులో భాగంగా ఆదివారం భారత్, న్యూజిలాండ్ మహిళల జట్లు పోటీ పడనున్నాయి.

### స్పోర్ట్స్ అకాడమీని ప్రారంభించిన టీమిండియా కెప్టెన్

టీమిండియా పార్ట్ టైమ్ వన్డే కెప్టెన్ శిఖర్ ధవన్ నిన్న (ఆగస్ట్ 5) ఢిల్లీలో స్పోర్ట్స్ అకాడమీని ప్రారంభించాడు. క్షేత్ర స్థాయి క్రీడాకారుల్లో నైపుణ్యాలను కనుగొని, వారిని ఆయా విభాగాల్లో మరింత రాటుదేల్చాలనే ధ్యేయంతో ఈ అకాడమీని నెలకొల్పుతున్నట్లు ధవన్ తెలిపాడు. ఈ అకాడమీకి 'డా వన్' అనే పేరును ఖరారు చేశాడు. క్రికెట్‌తో పాటు మరో 8 క్రీడాంశాల్లో క్రీడాకారులకు ఈ అకాడమీ శిక్షణ ఇవ్వనుందని తెలిపాడు. ఈ అకాడమీలో క్రీడాకారులతో పాటు కోచ్‌లకు కూడా శిక్షణ ఉంటుందని పేర్కొన్నాడు. కోచ్‌లు క్రీడాకారులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణ ఇచ్చేలా సానబెడతామని అన్నాడు. దేశవ్యాప్తంగా ఉత్తమ కోచ్‌లను ఎంపిక చేసి డా వన్ స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ ఇప్పిస్తామని వివరించాడు. క్రికెట్ నాకెంతో ఇచ్చింది.. ఇదిలా ఉంటే, ఇటీవలి కాలంలో వన్డేల్లో టీమిండియాను విజయవంతంగా ముందుండి నడిపిస్తున్న శిఖర్ ధవన్.. త్వరలో జింబాబ్వేలో వన్డే సిరీస్ కూడా కెప్టెన్‌గా ఎంపికైన విషయం తెలిసిందే. రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ అందుబాటులో లేని సమయంలో శ్రీలంక, వెస్టిండీస్ పర్యటనల్లో భారత్‌కు అద్భుతమైన విజయాలు అందించిన ధవన్.. జింబాబ్వేతో సిరీస్‌లోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేసి రెగ్యులర్ వన్డే కెప్టెన్‌గా కొనసాగాలని భావిస్తున్నాడు. ఒక్కో ఫార్మాట్‌కు ఒక్కో కెప్టెన్ అనే అంశాన్ని బీసీసీఐ పరిశీలిస్తున్న నేపథ్యంలో ధవన్ కెప్టెన్సీ అంశం ఆసక్తికరంగా మారింది. ధవన్ సైతం తనను టీ20లకు పరిగణలోకి తీసుకోకపోవడంపై పెద్దగా స్పందించకపోవడం చూస్తుంటే అతను మున్ముందు వన్డే ఫార్మాట్‌కు (కెప్టెన్‌గా) మాత్రమే పరిమితమవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. తొలి వన్డే ఆగస్టు 18రెండో వన్డే ఆగస్ట్ 20 మూడో వన్డే ఆగస్ట్ 22 జింబాబ్వే పర్యటనకు భారత జట్టు: శిఖర్ ధవన్ (కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్, శుభ్‌మన్ గిల్, దీపక్ హుడా, రాహుల్ త్రిపాఠి, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, అవేశ్ ఖాన్, ప్రసిధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్, దీపక్ చహర్

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190